PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR
# నవగీతం
NAVAGEETAM DINAPATHRIKA తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 37 | పేజీలు : 8 | మంగళవారం 30 జూన్ 2026 | వెల : 4/-




## నేటి నుంచి రైతుభరోసా
# నిధుల విడుదల



- తొలివిడతలో 41.37 లక్షల మంది అన్నదాతలకు లబ్ధి
- నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల చేస్తామన్న మంత్రి తుమ్మల
- నేడు 2 ఎకరాల వరకు రైతుభరోసా నిధుల జమ
- మిగతావారికి దశలవారీగా విడుదల చేస్తామన్న మంత్రి

**హైదరాబాద్**

రైతుభరోసా నిధుల విడుదలపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక ప్రకటన చేశారు. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో నిధుల జమ చేస్తామని తెలిపారు. అర్హులైన అన్నదాతలకు పెట్టుబడి సాయంగా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అందరికీ నిధులు జమచేస్తామన్నారు. రైతుభరోసా నిధుల విడుదల కోసం ఖమ్మం జిల్లా మధిరలో 'రైతు ఆశీర్వద సభ'ను నిర్వహించాలని ప్రభుత్వం తొలుత భావించింది. తొలి విడత నిధులు జమచేయాలని ప్లాన్? చేసింది. అయితే ఖమ్మంలో నిన్న (ఆదివారం) కురిసిన భారీ వర్షానికి ఇవాళ ఏర్పాటుచేయాలని భావించిన రైతు మేళా, రేపటి (మంగళవారం) కార్యక్రమం కోసం ఏర్పాటుచేసిన సభా ప్రాంగణం వద్ద ఇబ్బందులు తలెత్తాయి. దీంతో రైతు మేళా, రైతు ఆశీర్వాద సభను ప్రభుత్వం రద్దు చేసింది. - మిగతా3లో



## హర్మ్యూజ్ సంక్షోభంలో భారత్ విజయం

- టోల్ చెల్లించకుండా 12 నౌకలు ఇండియాకు
- హర్మ్యూజ్ మూసివేతతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం
- ఆ సమయంలో కేంద్ర తీసుకున్న చర్యలను వివరించిన హర్దీప్ సింగ్ పురీ
- పలు దేశాల నుంచి ముడి చమురు తెప్పించామని వెల్లడి
- దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా పెంచామన్న మంత్రి
- ఈ చర్యల వల్లే వినియోగదారులపై ప్రభావం పడలేదని వ్యాఖ్య

## వీబీజీ రామ్‌జీ చట్టాన్ని
# ఉపసంహరించాలి

- కొత్త చట్టంలో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపే నిబంధనలు ఉన్నాయి
- వాటిపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన అభ్యంతరాలు వ్యక్తం చేసింది
- సబ్ కమిటీ నివేదిక ఆధారంగా జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటాం
- గతంలో ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతన భారం 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించేదు
- మెటీరియల్ కాంపోనెంట్ లో కూడా కేంద్రం 75 శాతం వాటా కల్పించేదు
- గామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



**హైదరాబాద్**

వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించాలని తెలంగాణ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క స్పష్టం చేశారు. దేశ రాజధాని దిల్లీలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులు, ఉన్నతాధికారుల సమావేశంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వీబీజీ రామ్‌జీ చట్టం అమలుకు సంబంధించి - మిగతా3లో

## 12 ఏళ్లలో తెలంగాణకు
# రూ.వేల కోట్ల నిధులు



- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబపాలన, అవినీతిని ప్రోత్సహిస్తున్నాయి
- కుటుంబ అభివృద్ధి కోసమే బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు పని చేశాయి
- పుష్కరకాలంగా మోదీ సర్కార్ రూ.వేల కోట్ల నిధులు ఇచ్చింది
- మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి
- తెలంగాణ ప్రభుత్వంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్

**హైదరాబాద్**

12 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేసిన ఘనత మోదీ సర్కార్‌కే దక్కుతుందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. వరంగల్ బల్దియా సహా వచ్చే సార్వత్రిక ఎన్నికల్లోనూ తెలంగాణలో కాషాయ జెండా ఎగరాలని ఆకాంక్షించారు. వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి రూ.వేల కోట్లు ఇచ్చిన ఘనత మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వానిదేనని కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్?లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ హయాంలో కుటుంబ పాలన, అవినీతి తప్ప తెలంగాణ అభివృద్ధిని విస్మరించారని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ విమర్శించారు. హనుమకొండ ఆర్ట్స్ కళాశాల మైదానంలో బీజేపీ బూత్ అధ్యక్షుల సమ్మేళనం కార్యక్రమానికి కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు - మిగతా3లో

## ఉద్యోగులకు
# తీపి కబురు

- ఉద్యోగులకు రూ. 2 వేల కోట్ల బకాయిలను తాజాగా విడుదల
- ఇటీవల ఉద్యోగుల కోసం ప్రమాద జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.
- ఈ పథకం అమలు కోసం 14 ప్రముఖ బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం
- తెలంగాణలో ఉద్యోగుల ఆరోగ్య పథకం జులై 15 నుండి అధికారికంగా ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం



**హైదరాబాద్**

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం వరుసగా గుడ్ న్యూస్ లు చెబుతోంది. ఇటీవల ఉద్యోగుల కోసం ప్రమాద జీవిత బీమా పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం అమలు కోసం 14 ప్రముఖ బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అలాగే తెలంగాణలో ఉద్యోగుల ఆరోగ్య పథకం జులై 15 నుండి అధికారికంగా ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం - మిగతా3లో



## ఎన్నికలు జరిపే దేశాల్లో భారతదేశానికి ఒక మంచి గుర్తింపు

- పారదర్శక ఎన్నికల ప్రక్రియల్లో ప్రపంచానికి భారత్ నాయకత్వం వహిస్తోందని వ్యాఖ్యానించిన సీఈసీ జ్ఞానేశ్ కమార్
- ప్రజాస్వామ్యానికి వారే మూల స్తంభాలు
- ఈ పనులన్నింటినీ రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు కూడా స్వయంగా చూసి తనిఖీ చేసుకోవచ్చు

## రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే



- ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించిన రాజ్యసభ ఛైర్మన్
- ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజ్యసభకు ఎన్నికైన ఖర్గే
- రాజ్యసభ సభ్యునిగా ప్రమాణం చేసిన మల్లికార్జున ఖర్గే
- ఈనెల 26నుంచి అమల్లోకి రానున్న ఖర్గే నియామకం

## రాష్ట్రంలో పోలీస్‌శాఖలో
# భారీగా బదిలీలు



- 36 మంది డీఎస్పీల బదిలీ..
- ఇంటెలిజెన్స్ ఎస్పీగా ఇక్బాల్..!
- డీజీపీ సీవీ ఆనంద్ ఉత్తర్వులు
- గత కొంతకాలంగా ఎలాంటి పోస్టింగ్స్ లేక హెడ్‌క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్న 28 మంది సివిల్ డీఎస్పీ అధికారులకు కొత్త స్థానాలను కేటాయింపు



## అమర్‌నాథ్ యాత్రకు శ్రీకారం..

- పవిత్ర గుహలో ప్రథమ పూజ.. ఈసారి హెలికాప్టర్లు బంద్
- పూజలో పాల్గొన్న జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా
- జులై 3 నుంచి ఆగస్టు 28 వరకు 57 రోజుల పాటు కొనసాగనున్న యాత్ర
- ఈ ఏడాది బేస్ క్యాంపుల నుంచి హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని ప్రకటన
- యాత్ర భద్రత, ఏర్పాట్లపై లెఫ్టినెంట్ గవర్నర్ భక్తులకు భరోసా

నవగీతం
తెలుగు దినపత్రిక
సోమవారం
29 జూన్ 2026

# ఎన్నికలు జరిపే దేశాల్లో భారతదేశానికి ఒక మంచి గుర్తింపు

ప్రపంచంలో ఎన్నికలు జరిపే దేశాల్లో భారతదేశానికి ఒక మంచి గుర్తింపు ఉందని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ అన్నారు. ఎక్కడా తప్పులు జరగకుండా, ఎంతో పారదర్శకంగా, నిజాయితీ ఎన్నికలు జరపడంలో భారత్ ప్రపంచ దేశాల కంటే చాలా ముందు ఉందని ఆయన అన్నారు. బుద్గామ్‌లో బుత్ స్థాయి అధికారుల(బీఎల్ఓ)తో సమావేశం అయిన తర్వాత ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నికల నిర్వహణ విషయంలో భారత్‌కు చాలా మంచి పేరు ఉందని చెబుతూ, 2026 సంవత్సరానికిగాను ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డెమోక్రసీ అండ్ ఎలక్టోరల్ అసిస్టెన్స్ అనే అంతర్జాతీయ సంస్థకు ప్రస్తుతం భారతదేశం అధ్యక్షత వహిస్తోందని సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. 'ప్రజాస్వామ్యానికి బూత్ స్థాయి అధికారులే అసలైన స్తంభాలు' అని జ్ఞానేశ్ కుమార్? అన్నారు. కనుక వారితో కలిసి రానున్న ఎన్నికల ఏర్పాట్లు గురించి మాట్లాడినట్లు ఆయన చెప్పారు. మన దేశంలో ఓటర్ల నమోదు, పోలింగ్, ఓట్ల లెక్కింపు మొదలైనవి అన్నీ అందరికీ తెలిసేలా చాలా నిజాయితీగా జరుగుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ పనులన్నింటినీ రాజకీయ పార్టీలు, పోటీ చేసే అభ్యర్థులు కూడా స్వయంగా చూసి తనిఖీ చేసుకోవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా "ప్రపంచంలోనే అత్యంత పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లను భారతదేశంలో మన బూత్ స్థాయి అధికారులు, సిబ్బంది మాత్రమే చేయగలరు " అని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు జరిపే పద్ధతుల్లో ప్రస్తుతం మన దేశం ప్రపంచంలోని అన్ని పెద్ద దేశాల కంటే ముందుందని తమ ఎన్నికల అధికారులకు చెప్పినట్లు సీఈసీ తెలిపారు.




### ఓటర్లతో నేరుగా మాట్లాడనున్న సీఈసీ

బుద్గాంలోని ఫ్యాషన్ టెక్నాలజీ కాలేజీ (ఎన్ఐఎఫ్‌టీ) క్యాంపస్‌లో ఈ సమావేశం జరిగింది. ఓటర్లు, ఎన్నికల అధికారులు, క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో మాట్లాడేందుకు, అలాగే పనులను పరిశీలించేందుకు సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆదివారం శ్రీనగర్ వచ్చారు. ఆయన జమ్మూకశ్మీర్?లో మూడు రోజులపాటు పర్యటించనున్నారు. ఈ పర్యటనలో జమ్మూకశ్మీర్‌లోని అందమైన లోయల్లో ఉండే ఓటర్లు అందరినీ కలిసి మాట్లాడతానని, ముఖ్యంగా గ్రామాల స్థాయిలో పనిచేసే సిబ్బందితో కలవడంపై ఎక్కువ దృష్టి పెట్టనున్నట్లు సీఈసీ చెప్పారు. కాగా, ఓటర్లతో బంధాన్ని పెంచుకోవడానికి, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను మెరుగుపరచడానికి, ప్రజల్లో ఎన్నికలపై అవగాహన పెంచడానికి భారత ఎన్నికల సంఘం ఎప్పుడూ ప్రయత్నిస్తూనే ఉంటుందని, అందులో భాగంగానే సీఈసీ పర్యటన చేపట్టారని అధికారులు తెలిపారు.

## హర్మూజ్ సంక్షోభంలో భారత్ విజయం



ప్రపంచాన్ని కుదిపేసిన ఇంధన సంక్షోభ సమయంలో పరిస్థితిని భారత్ సమర్థంగా ఎదుర్కొందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ తెలిపారు. హర్మూజ్ జలసంధిని దాదాపు నాలుగు నెలలు మూసివేసినా దేశంలో ఇంధన సరఫరాపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. టోల్ చెల్లించకుండానే 12కు పైగా ఎల్‌పీజీ నౌకలను హర్మూజ్ నుంచి తరలించామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని పురీ పేర్కొన్నారు. ముడిచమురు దిగుమతులను ఒక్క దేశానికే పరిమితం చేయకుండా పలు దేశాల నుంచి తెప్పించామని చెప్పారు. దీంతో దేశంలో వంటగ్యాస్, ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడలేదన్నారు. సంక్షోభ సమయంలో దేశీయ ఎల్‌పీజీ ఉత్పత్తిని కూడా భారీగా పెంచామని వివరించారు. ఇంతకుముందు వంటగ్యాస్ ఉత్పత్తి చేయని రిఫైనరీలను కొద్ది రోజుల్లోనే మార్పులు చేసి ఎల్‌పీజీ తయారీకి సిద్ధం చేశామని చెప్పారు. దీంతో రోజుకు 35 వేల మెట్రిక్ టన్నులుగా ఉన్న ఉత్పత్తిని 54 వేల మెట్రిక్ టన్నులకు పెంచగలిగామని తెలిపారు. వంటగ్యాస్ కొరత రాకుండా అల్జీరియా, జపాన్, కెనడా వంటి దేశాలతో కొత్త సరఫరా ఒప్పందాలు కుదుర్చుకున్నామని పురీ చెప్పారు. అమెరికా నుంచి అదనపు ఎల్‌పీజీ కార్గోలను కూడా తెప్పించామని వెల్లడించారు. దీంతో దేశీయ అవసరాలను పూర్తిగా తీర్చగలిగామని అన్నారు. ఇంధన ధరల భారం తగ్గించేందుకు కేంద్రం లీటరుకు రూ.10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిందని గుర్తుచేశారు. అలాగే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు వంటగ్యాస్ పంపిణీలో డిజిటల్ అథెంటికేషన్ విధానాన్ని తప్పనిసరి చేశామని చెప్పారు. ఈ చర్యల వల్ల ప్రపంచ ఇంధన సంక్షోభ ప్రభావం భారత వినియోగదారులపై పడకుండా కాపాడగలిగామని హర్దీప్ పేర్కొన్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు శ్రీకారం..



ప్రతిష్ఠాత్మక శ్రీ అమర్‌నాథ్ జీ యాత్ర-2026 లాంఛనంగా ప్రారంభమైంది. సోమవారం పవిత్ర గుహాలయంలో 'ప్రథమ పూజ'ను శాస్త్రోక్తంగా నిర్వహించారు. జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఈ కార్యక్రమంలో పాల్గొని, యాత్ర సన్నాహాలకు అధికారికంగా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మంచులింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం అనంతరం లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా 'ఎక్స్' వేదికగా తన సంతోషాన్ని పంచుకున్నారు. "హర హర మహాదేవ్! శ్రీ అమర్‌నాథ్ జీ పవిత్ర గుహలో ప్రథమ పూజ నిర్వహించడం నిజంగా నా అదృష్టం. ఇది వార్షిక యాత్రకు లాంఛనమైన ప్రారంభం. బాబా బర్ఫానీ ఆశీస్సులతో ప్రజలందరూ శాంతి, శ్రేయస్సు, సంపూర్ణ ఆరోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించాను" అని ఆయన పేర్కొన్నారు. ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర జులై 3న ప్రారంభమై, ఆగస్టు 28న శ్రావణ పౌర్ణమి, రక్షా బంధన్ పండుగలతో ముగుస్తుంది. మొత్తం 57 రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. యాత్రను సురక్షితంగా, ఎలాంటి ఆటంకాలు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మనోజ్ సిన్హా తెలిపారు. "యంత్రాంగం, పుణ్యక్షేత్రాల బోర్డు, సైన్యం, పోలీసులు, ఇతర భద్రతా దళాలు, స్థానిక ప్రజలు, సేవా ప్రదాతలు, వాలంటీర్లు అందరూ పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నారు. భక్తులకు మరపురాని ఆధ్యాత్మిక అనుభూతిని అందించడానికి సర్వం సిద్ధం చేశాం" అని ఆయన భరోసా ఇచ్చారు. భారీగా మెరుగుపరిచిన మౌలిక సదుపాయాలు, అదనపు సౌకర్యాలతో యాత్రికులకు స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్నామని వివరించారు. అనంతనాగ్ జిల్లాలోని కశ్మీర్ హిమాలయాల్లో, సముద్ర మట్టానికి 3,880 అడుగుల ఎత్తులో ఈ పవిత్ర గుహ ఉంది. ఇక్కడి మంచుతో సహజసిద్ధంగా ఏర్పడే శివలింగాన్ని భక్తులు శివుని దివ్య శక్తులకు ప్రతీకగా భావిస్తారు. యాత్రికులు ప్రధానంగా రెండు మార్గాల ద్వారా గుహకు చేరుకుంటారు. సంప్రదాయ పహల్గామ్ మార్గంలో ప్రయాణానికి నాలుగు రోజులు పడుతుంది. అయితే, బల్తాల్ బేస్ క్యాంప్ నుంచి వెళ్లే యాత్రికులు దర్శనం చేసుకుని అదే రోజు తిరిగి రావచ్చు.

### ఈ ఏడాది హెలికాప్టర్ సేవలు బంద్

ఈ ఏడాది యాత్రలో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకుంది. బేస్ క్యాంపులైన పహల్గామ్, బల్తాల్ నుంచి పవిత్ర గుహకు వెళ్లే మార్గాన్ని 'నో-ఫ్లై జోన్'గా అధికారులు ప్రకటించారు. ఈ కారణంగా, ఈ యాత్రలో భక్తులకు హెలికాప్టర్ సేవలు అందుబాటులో ఉండవని స్పష్టం చేశారు. యాత్రికులు ఈ మార్పును గమనించి, అందుకు అనుగుణంగా తమ ప్రయాణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# రాజ్యసభ ప్రతిపక్ష నేతగా మరోసారి మల్లికార్జున ఖర్గే

రాజ్యసభకు తిరిగి ఎన్నికైన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రతిపక్ష నేతగా మళ్లీ గుర్తింపు పొందారు. ఆయన పదవీకాలం ఈనెల 25తో ముగియనుండగా ఇటీవల జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో తిరిగి ఎన్నికయ్యారు. దీంతో రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ ఖర్గేను ప్రతిపక్ష నేతగా గుర్తించారు. ఈనెల 26నుంచి ప్రతిపక్ష నేతగా ఆయన నియామకం అమల్లోకి వస్తుందని రాజ్యసభ సెక్రటరీ జనరల్ ̮రాజ మోదీ బులెటిన్ విడుదల చేశారు. అంతకుముందు రాజ్యసభ ఛైర్మన్ ఛాంబర్‌లో సోమవారం మల్లికార్జున ఖర్గే ప్రమాణం చేశారు. ఖర్గే చేత రాజ్యసభ ఛైర్మన్ ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే తన చేతిలో రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హిందీలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా హాజరయ్యారు. రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ప్రతిపక్ష నాయకుడిగా తన సేవలను కొనసాగిస్తానని ఖర్గే అన్నారు. రాజ్యసభకు తన పునఃనియమించడాన్ని, ప్రతిపక్ష నాయకుడిగా తనను కొనసాగించడాన్ని అపారమైన గర్వకారణంగా అభివర్ణించారు. అటు అధికారులు, పార్టీ నాయకత్వం, రాజకీయ సహచరులు అందించిన మద్దతుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

"రాజ్యసభ సభ్యుడిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేసే గౌరవం నాకు లభించింది. రాజ్యసభకు ప్రతిపక్ష నాయకుడిగా సేవలు కొనసాగించడం అపారమైన గర్వకారణం, బాధ్యత. నాకు నిరంతరం మద్దతు అందించిన భారత ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు, డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు. కాంగ్రెస్ నాయకత్వానికి, ముఖ్యంగా సీపీపీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీకి, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ధన్యవాదాలు. ఇంకా కాంగ్రెస్ పార్టీలోని తోటి సహచరులు, ఎంపీలకు, నా సుదీర్ఘ ప్రజా జీవితం, పార్లమెంటరీ సేవ ప్రయాణంలో అచంచలమైన విశ్వాసం, ప్రోత్సాహంతో నాకు



అండగా నిలిచిన లెక్కలేనంత మంది పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లకు, ముఖ్యంగా ఇండియా బ్లాక్‌లోని సహచరులకు, ఇతర ప్రతిపక్షాల సహకారానికి నేను కృతజ్ఞుడను."

"రాబోయే పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో మరింత బలమైన సమన్వయం కోసం ఎదురుచూస్తున్నాను. తద్వారా మనమందరం కలిసి అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని మరింత జవాబుదారీగా చేయగలం. ప్రజల తీవ్రమైన ఆందోళనలు, ఆకాంక్షలు, గొంతులను మేము చిత్తశుద్ధితో, దృఢ విశ్వాసంతో, సంకల్పంతో లేవనెత్తుతూనే ఉంటాం. అదే మా ప్రధాన కర్తవ్యం. ఇది నా బాధ్యత కూడా. దీనిని నేను అత్యంత నిబద్ధతతో నిర్వర్తిస్తాను." అని ఖర్గే ఎక్స్?లో రాసుకొచ్చారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ అధినేత మల్లికార్జున ఖర్గే, బీజేపీ నేత తరుణ్ చుగ్ సహా ఎనిమిది మంది నూతన రాజ్యసభ ఎంపీలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నూతన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఖర్గే ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఛాంబర్‌లో ప్రత్యేకంగా ప్రమాణ స్వీకారం చేయగా, మిగిలిన ఏడుగురు సభ్యులు రాజ్యసభ ఛాంబర్‌లో ప్రమాణం చేశారు.

నూతనంగా ప్రమాణం చేసిన వారిలో జితేంద్ర మేఘ్‌జీభాయ్ కంజారియా, మాన్‌సింగ్ మేరామన్ పర్మార్ (గుజరాత్), ఎం. నాగరాజ (కర్ణాటక), రాజేంద్ర హీరాలాల్ జైన్ (మహారాష్ట్ర), అధికారిమయుమ్ శారదా దేవి (మణిపూర్), అల్కా సింగ్ (రాజస్థాన్) ఉన్నారు. ఛైర్మన్ ఛాంబర్, సభలో జరిగిన ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమాల్లో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్, సభ నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు, న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ పాల్గొన్నారు.

# చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ కారిడార్

**భారత్ ముందు మరో పెద్ద సవాల్**

**ఈశాన్యాన మన వ్యూహం మార్చాల్సిందేనా**

**చైనా, మయన్మార్, బంగ్లాదేశ్ ఎకనామిక్ కారిడార్ ప్రతిపాదన**

**భారత్‌కు వ్యూహాత్మకంగా సవాలు విసిరే అవకాశం ఉందని అంచనాలు- బంగాళాఖాతంలో చైనాకు బూస్ట్!**

ఇండో పసిఫిక్ ప్రాంతంలో పోటీ ముదురుతున్న వేళ భారత్ సహా చుట్టుపక్కల తన వ్యూహాత్మక ఉనికిని విస్తరించుకునేందుకు చైనా మరోసారి దూకుడుగా అడుగు వేసింది. పశ్చిమ సరిహద్దుల్లో పాకిస్థాన్‌తో కలిసి నిర్మిస్తున్న చైనా- పాకిస్థాన్ ఆర్థిక కారిడార్ (ఎకనామిక్ కారిడార్) తరహాలోనే ఇప్పుడు భారత్‌కు తూర్పు సరిహద్దుల్లో కూడా ఒక భారీ కారిడార్‌ను నిర్మించేందుకు చైనా ప్రణాళికలు రచిస్తోంది. భారత తూర్పు ప్రాంతానికి సవాల్ విసిరేలా చైనా ఇప్పుడు మరో కీలక ఆర్థిక ప్రాజెక్టును ముందుకు తీసుకొచ్చింది. బంగ్లాదేశ్, మయన్మార్ దేశాల్ని కలుపుతూ 'చైనా- మయన్మార్- బంగ్లాదేశ్ ఎకనామిక్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలనే చైనా ప్రతిపాదన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే బంగాళాఖాతం ప్రాంతంపై చైనా ప్రభావం మరింత పెరగడంతో పాటుగా భారత ఈశాన్య ప్రాంత భద్రత, కనెక్టివిటీ, ప్రాంతీయ వ్యూహంపైనా ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రతిపాదన చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, బంగ్లాదేశ్ ప్రధాని తారిక్ రెహ్మాన్ మధ్య బీజింగ్‌లో జరిగిన సమావేశంలో చర్చకు వచ్చింది. సమావేశం అనంతరం బంగ్లాదేశ్ ప్రధానమంత్రి కార్యాలయ ప్రతినిధి మహదీ అమిన్ మాట్లాడుతూ, మయన్మార్ మీదుగా బంగ్లాదేశ్‌ను చైనాతో అనుసంధానించే ఆర్థిక



కారిడార్ ఏర్పాటు చేసే అంశంపై ఇరు దేశాలు చర్చించినట్లు తెలిపారు. ఈ కారిడార్ ప్రధాన లక్ష్యం బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం సహా వాణిజ్యాన్ని విస్తరించడం, రహదారి, రైల్వే, సముద్ర మార్గ రవాణా వ్యవస్థను అభివృద్ధి చేయడమేనని ఆయన చెప్పారు. ఇంకా చిట్టగాంగ్, మోంగ్లా నౌకాశ్రయాల్ని ఆధునీకరించేందుకు చైనా ఆసక్తి చూపినట్లు వెల్లడించారు. చిట్టగాంగ్ పోర్టును ప్రాంతీయ వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని కూడా చైనా ప్రతిపాదించినట్లు తెలిపారు.

### భారత చికెన్స్ నెక్‌కు ముప్పు?

ఈ ప్రాజెక్ట్ అమలైతే చైనా యున్నాన్ ప్రావిన్స్ నుంచి మయన్మార్ మీదుగా బంగ్లాదేశ్, అక్కడి నుంచి బంగాళాఖాతం వరకు ఒక కీలక ఆర్థిక మార్గం ఏర్పడుతుంది. దీంతో బంగాళాఖాతాన్ని చైనాతో నేరుగా అనుసంధానించే వ్యూహాత్మక మార్గంగా మారే అవకాశం ఉంది. ఈశాన్య రాష్ట్రాలకు అత్యంత కీలకమైన సిలిగుడీ కారిడార్ సమీప ప్రాంతాల్లో చైనా ప్రభావాన్ని పెంచే అవకాశం ఉండటం వల్ల భారత్‌కు ఇది కీలక భద్రతా అంశంగా మారనుందని అభిప్రాయపడుతున్నారు. చికెన్స్ నెక్‌గా పిలిచే ఈ సిలిగుడీ కారిడార్ ద్వారానే భారత ప్రధాన భూభాగం ఈశాన్య రాష్ట్రాలతో అనుసంధానమై ఉంటుంది. ఈ ప్రాంతానికి సమీపంలో చైనా మద్దతుతో భారీ కనెక్టివిటీ ప్రాజెక్ట్ ఏర్పడితే భవిష్యత్తులో వ్యూహాత్మక ప్రభావం చూపే అవకాశాన్ని భారత్ పరిశీలిస్తోంది.

### మయన్మార్‌లో ఘర్షణలు- అంత ఈజీ కాదు!

ఈ ప్రతిపాదనను చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ విస్తరణలో భాగంగా కూడా విశ్లేషిస్తున్నారు. ఇప్పటికే మయన్మార్‌లోని క్యాక్‌ఫ్యూ డీప్-సీ పోర్ట్, ప్రత్యేక ఆర్థిక మండలి, బంగ్లాదేశ్‌లో పోర్టులు, విద్యుత్ ప్రాజెక్టులు, రవాణా రంగాల్లో చైనా భారీగా పెట్టుబడులు పెట్టింది. ఇప్పుడు ఈ కొత్త కారిడార్ ద్వారా ప్రాజెక్టులన్నింటినీ ఒకే నెట్‌వర్క్‌గా అనుసంధానించే ప్రయత్నం జరుగుతోంది. మరోవైపు భారత్ ఇప్పటికే తన యాక్ట్ ఈస్ట్ పాలసీలో భాగంగా ఇండియా- మయన్మార్- థాయ్‌లాండ్ త్రైపాక్షిక రహదారి, కలాదాన్ మల్టీ మోడల్ ట్రాన్సిట్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్ట్, దీదీ×చీ, దీ×మీజుజ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టుల్ని అమలు చేస్తోంది. అయితే మయన్మార్‌లో కొనసాగుతున్న అంతర్గత ఘర్షణల కారణంగా ఈ ప్రాజెక్టులు ఆశించినంత వేగంగా ముందుకు సాగట్లేదు.

### 'ప్రభావం ఇప్పుడే అంచనా వేయలేం'

మయన్మార్‌లో ఒకప్పుడు భారత రాయబారిగా పనిచేసిన రాజీవ్ భాటియా ఈ ప్రాజెక్ట్ అమలుపై కొన్ని సందేహాల్ని వ్యక్తం చేశారు. గతంలో చైనా- భారత్- బంగ్లాదేశ్- మయన్మార్ కారిడార్ ఏర్పాటుకు కూడా ప్రయత్నాలు జరిగినా అవి విజయవంతం కాలేదని గుర్తుచేశారు. మయన్మార్‌లో ప్రస్తుత అంతర్గత భద్రతా పరిస్థితులు కొత్త ప్రాజెక్టుకు ప్రధాన అడ్డంకిగా మారే అవకాశం ఉందని చెప్పారు. ఇంకా పూర్తి ప్రణాళిక బయటకు వచ్చిన తర్వాతే భారత్‌పై ఈ కారిడార్ ప్రభావాన్ని స్పష్టంగా అంచనా వేయొచ్చని అభిప్రాయ పడ్డారు. ఇక బంగ్లాదేశ్ ఇటు భారత్, అటు చైనా రెండింటితో సమానంగా సంబంధాలు కొనసాగిస్తూ ఆర్థిక ప్రయోజనాల్ని గరిష్ఠంగా పొందే వ్యూహాన్ని అనుసరిస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. భారత్‌తో స్నేహపూర్వక సంబంధాల్ని కొనసాగిస్తూనే చైనా నుంచి కూడా పెట్టుబడుల్ని ఆకర్షిస్తోంది. మొత్తంగా చూస్తే ఈ కొత్త ఎకనామిక్ కారిడార్ కేవలం వాణిజ్య ప్రాజెక్టు మాత్రమే కాదు. బంగాళాఖాతంలో చైనా ప్రభావాన్ని మరింత విస్తరించే వ్యూహాత్మక ప్రయత్నంగా కూడా దీన్ని చూస్తున్నారు. ఈ ప్రాజెక్టు మరింత ముందుకు వెళ్తే భారత తన తూర్పు ప్రాంత కనెక్టివిటీ, ఈశాన్య రాష్ట్రాల మౌలిక సదుపాయాలు, ప్రాంతీయ దౌత్య వ్యూహాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
సోమవారం
29 జూన్ 2026

# వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించాలి


-మొదటిపేజీ తరువాయి
తెలంగాణ ప్రభుత్వ అభ్యంతరాలను మంత్రి సీతక్క వివరించారు. అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రాష్ట్ర ప్రభుత్వ తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి సీతక్క మాట్లాడుతూ.. కొత్త చట్టంలో రాష్ట్రాలపై అధిక ఆర్థిక భారం మోపే నిబంధనలు ఉన్నాయని, వాటిపై తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన అభ్యంతరాలు వ్యక్తం చేసిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ ఇప్పటికే రెండుసార్లు సమావేశమై అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిందని తెలిపారు. సబ్ కమిటీ నివేదిక ఆధారంగా జూలై 2న జరిగే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద కూలీల వేతన భారం 100 శాతం కేంద్ర ప్రభుత్వమే భరించేదని, మెటీరియల్ కాంపోనెంట్ లో కూడా కేంద్రం 75 శాతం వాటా కల్పించేదని గుర్తు చేశారు. కొత్త విధానంలో 60:40 నిష్పత్తి అమలు చేయడం వల్ల రాష్ట్రాలపై వేల కోట్ల రూపాయల అదనపు భారం పడుతుందని అన్నారు. ఇప్పటివరకు రాష్ట్ర వాటా కొన్ని వందల కోట్ల రూపాయల పరిధిలో ఉండగా, కొత్త విధానంలో తెలంగాణ వాటా సుమారు రూ.2,000 కోట్ల వరకు పెరిగే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొన్నారు. వీబీజీ రామ్‌జీ చట్టంలో ప్రతిపాదించిన కొన్ని నిబంధనలు పేదలు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ కార్మికుల ప్రయోజనాలకు విఘాతం కలిగించేలా ఉన్నాయని మంత్రి సీతక్క అన్నారు. రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకోకుండా చట్టాన్ని తీసుకురావడం సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని అభిప్రాయపడ్డారు. చట్టానికి పేరు మార్చడమే కాకుండా, అమలులో రాష్ట్రాలపై అదనపు ఆర్థిక బాధ్యతలు మోపడం సరైన విధానం కాదన్నారు. అదేవిధంగా తెలంగాణకు సంబంధించిన ఇతర కీలక అంశాలను కూడా కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పీఎం ఆవాస్ యోజన కింద రెండు సంవత్సరాల క్రితమే తెలంగాణ ప్రభుత్వం లబ్ధిదారుల సర్వే పూర్తి చేసి కేంద్రానికి పంపించినప్పటికీ ఇప్పటికీ ఇళ్ల మంజూరు జరగలేదని, వెంటనే ఆమోదం ఇవ్వాలని కోరినట్లు చెప్పారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కింద తెలంగాణలో మంజూరైన అనేక రహదారి పనులు అటవీ, వన్యప్రాణి అనుమతుల సమస్యలతో నిలిచిపోయాయని తెలిపారు. ముఖ్యంగా ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, నల్లమల, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ప్రాంతాల్లో రోడ్లు, నివాసాలు, బోర్లు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణం కూడా అటవీ అనుమతుల కారణంగా నిలిచిపోతోందని వివరించారు. రోడ్లకు కేంద్రం మంజూరు ఇచ్చినప్పుడే అటవీ శాఖ నుంచి అవసరమైన క్లియరెన్స్‌లు కూడా కల్పించే విధానం తీసుకురావాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ నిధులను కూడా వెంటనే విడుదల చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఈ అంశాలపై సానుకూలంగా స్పందించారని, అటవీ అనుమతుల సమస్యల పరిష్కారం కోసం సంబంధిత కేంద్ర మంత్రిత్వ శాఖతో చర్చిస్తామని హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. వీబీజీ రామ్‌జీ చట్టంపై తెలంగాణ ప్రభుత్వ వైఖరి స్పష్టమని, రాష్ట్ర ప్రయోజనాలు, గ్రామీణ పేదల సంక్షేమం, ఆర్థిక పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన అనంతరమే మంత్రివర్గం తుది నిర్ణయం ప్రకటిస్తుందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. కొత్త చట్టంలో చేరాలా, వద్దా అనే అంశంపై జూలై 2న జరిగే రాష్ట్ర క్యాబినెట్ సమావేశం అనంతరం అధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి తెలంగాణ నిర్ణయం తెలియజేస్తామని మంత్రి తెలిపారు. నూతన చట్టంపై మంత్రి సీతక్క అభ్యంతరాలు వీబీజీ రామ్‌జీ చట్టానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ప్రధాన అభ్యంతరాలు, సూచనలను సమావేశంలో మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)ను హక్కు ఆధారిత కార్యక్రమంగానే కొనసాగించాలని, ప్రతిపాదిత వీబీజీ రామ్‌జీ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్త చట్టం గ్రామీణ పేదల పని హక్కును బలహీనపరచడంతో పాటు గ్రామ పంచాయతీల అధికారాలను తగ్గించి, రాష్ట్రాల పాత్రను పరిమితం చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు, అమలు, పర్యవేక్షణ వంటి కీలక అధికారాలను కేంద్రం వద్దే కేంద్రీకరించడం సహకార సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘం సిఫార్సుల ఆధారంగా మాత్రమే నిధుల కేటాయింపు చేయడం సమంజసం కాదని, గ్రామ పంచాయతీ స్థాయిలో ఉన్న వాస్తవ ఉపాధి డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని నిధులు కేటాయించాలని తెలంగాణ సూచించింది. గత ఐదేళ్లలో రాష్ట్రాలకు కల్పించిన పని దినాలకు 80 శాతం, ఆర్థిక సంఘం సిఫార్సులకు 20 శాతం వెయిటేజీ ఇవ్వాలని ప్రతిపాదించింది. వెనుకబడిన ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, ఐదో షెడ్యూల్ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి కోరారు. కొత్త చట్టంలో కేంద్రం కేవలం 60 శాతం మాత్రమే నిధులు భరిస్తుండగా, మిగిలిన 40 శాతం రాష్ట్రాలపై భారం పడుతోందని మంత్రి సీతక్క తెలిపారు. ఇప్పటికే కేంద్ర ప్రాయోజిత పథకాల వల్ల రాష్ట్రాలపై ఆర్థిక ఒత్తిడి పెరిగిందని, మరింత భారం మోపడం అమలును క్లిష్టతరం చేస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాలతో సమగ్ర సంప్రదింపులు జరపకుండానే చట్టం రూపొందించడం సరికాదని, రాష్ట్రాలకు ప్రణాళిక, అమలు, పర్యవేక్షణలో మరింత అధికారాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నూతన చట్టంలో అనుమతించే పనుల జాబితాను విస్తరించాలని తెలంగాణ ప్రభుత్వం కోరింది. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం, వ్యక్తిగత భూఅభివృద్ధి పనులు, వరదల అనంతర పునరుద్ధరణ పనులు, న్యూట్రి గార్డెన్లు, వెదురు తోటలు, కూరగాయల పందిళ్లు, పశుగ్రాస అభివృద్ధి, వర్క్‌షెడ్లు వంటి స్థానిక అవసరాలకు అనుగుణమైన పనులను చట్టంలో చేర్చాలని సూచించింది. రాష్ట్రాల స్థానిక అవసరాలకు అనుగుణంగా కొత్త పనులను ఆమోదించే స్వేచ్ఛ కల్పించాలని మంత్రి కోరారు. పథకంలో ప్రతిపాదించిన తప్పనిసరి 60 రోజుల ఉపాధి విరామాన్ని పూర్తిగా ఉపసంహరించాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. వ్యవసాయంలో యాంత్రీకరణ పెరిగిన ప్రస్తుత పరిస్థితుల్లో ఈ నిబంధన గ్రామీణ పేద కుటుంబాల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని మంత్రి వివరించారు. రైతుల ప్రయోజనాలు, ఉపాధి కూలీల ప్రయోజనాలు పరస్పర విరుద్ధం కాదని, గ్రామీణ పరిస్థితులు రాష్ట్రానికో, ప్రాంతానికో భిన్నంగా ఉంటాయని చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, ఐదో షెడ్యూల్ ప్రాంతాలు, నీటి ఎద్దడి ప్రాంతాలు, మొక్కల పెంపకం కార్యక్రమాలు, రాష్ట్ర గృహ నిర్మాణ పథకాల పనులకు ఈ నిబంధన నుంచి మినహాయింపులు కల్పించాలని సూచించారు. తెలంగాణలోని ఐదో షెడ్యూల్ ప్రాంతాలకు ఈశాన్య రాష్ట్రాల తరహాలో 90:10 కేంద్ర రాష్ట్ర నిధుల నిష్పత్తిని అమలు చేయాలని కూడా కోరారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, భూమిలేని వ్యవసాయ కూలీలు, చిన్న, సన్నకారు రైతులు, ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలకు ఎలాంటి నష్టం కలగకుండా కొత్త చట్టంలో సవరణలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామ పంచాయతీల నుంచే వచ్చే వాస్తవ ఉపాధి డిమాండ్ ఆధారంగా ప్రణాళిక, పనుల ఎంపిక, నిధుల కేటాయింపు జరిగితేనే అత్యంత వెనుకబడిన గ్రామాలకు సమర్థవంతంగా ప్రయోజనం చేకూరుతుందని మంత్రి సీతక్క తెలిపారు.

గ్రామీణ పేద కుటుంబాల ఉపాధి హక్కులను పరిరక్షించడం, గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడం, రాష్ట్రాలకు తగిన స్వేచ్ఛ, గౌరవం కల్పించడం ద్వారా మాత్రమే గ్రామీణాభివృద్ధి లక్ష్యాలు సమర్థవంతంగా సాధ్యమవుతాయని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన సూచనలను కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా పరిగణించి, సహకార సమాఖ్య స్ఫూర్తితో గ్రామీణ భారత అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు స్టీల్ బ్రిడ్జి

**హైదరాబాద్ :** హైదరాబాద్ నగరవాసులకు గుడ్‌న్యూస్. పాతబస్తీ పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు జీహెచ్‌ఎంసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్టీల్ బ్రిడ్జి పనులన్నీ దాదాపుగా పూర్తయ్యాయి. రూ.620 కోట్ల అంచనా వ్యయంతో 3.32 కిలోమీటర్ల పొడవున 85 పిల్లర్లతో ఈ వంతెనను నిర్మించారు. ఈ మార్గంలో ప్రధాన పనులైన బిటుమినస్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా.. మరో నెల రోజుల్లో దీనిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి బల్దియా వేగంగా అడుగులు వేస్తోంది. గతంలో భూసేకరణ, కరోనా లాక్‌డౌన్, నిధుల కొరత వల్ల ఈ ప్రాజెక్టు ఆలస్యమైనప్పటికీ.. ప్రస్తుతం పనులు పూర్తి

చేసుకొని ప్రారంభానికి సిద్ధమైంది. హైదరాబాద్ నగర ప్రజలకు, ముఖ్యంగా పాతబస్తీ పరిధిలోని సంతోష్‌నగర్, చంచల్‌గూడ, సైదాబాద్ పరిసర ప్రాంతాల వాహనదారులకు త్వరలోనే ట్రాఫిక్ కష్టాల నుంచి శాశ్వత విముక్తి లభించనుంది. చంచల్‌గూడ జైలు జంక్షన్ నుంచి సంతోష్‌నగర్ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై జీహెచ్‌ఎంసీ చేపట్టిన ప్రతిష్టాత్మక సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జి పనులన్నీ దాదాపుగా ముగింపు దశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల్లోనే ఈ వంతెనపై వాహనాలు రయ్యిరయ్యిన దూసుకెళ్లనున్నాయని జీహెచ్‌ఎంసీ అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించిన మిగిలిన చిన్నపాటి అనుబంధ పనులను బల్దియా ఇంజినీరింగ్ విభాగం యుద్ధప్రతిపాదికన చకచకా పూర్తిచేస్తోంది. ఈ ప్రాజెక్టులో అత్యంత కీలకమైన పనులైన బ్రిడ్జిపై బిటుమినస్ కాంక్రీట్ రోడ్డు నిర్మాణాన్ని అధికారులు విజయవంతంగా పూర్తిచేయించారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్ శు క్రవారం మాట్లాడుతూ.. వంతెనకు సంబంధించిన సివిల్, రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయని కేవలం చిన్నపాటి తుది మెరుగులు మాత్రమే మిగిలున్నాయని స్పష్టం చేశారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం కింద రూ.620 కోట్ల భారీ వ్యయంతో 3.32 కిలోమీటర్ల పొడవున ఈ భారీ స్టీల్ వంతెనను నిర్మిస్తున్నారు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. సంతోష్ నగర్ నుంచి చంచల్‌గూడ ప్రయాణం కేవలం ఐదు నిమిషాల్లోనే ముగిసిపోతుంది. మొత్తం 85 పిల్లర్లపై ఈ



అధునాతన స్టీల్ వంతెనను డిజైన్ చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి పైన, కింద నిర్మించాల్సిన ర్యాంప్ పనులు, రక్షణ గోడ నిర్మాణం, జాయింట్ల విస్తరణ పనులతో పాటు బ్రిడ్జి కింద కాలిబాట గోడల నిర్మాణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని సైతం నెల రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన వివరించారు. సంతోష్‌నగర్, సైదాబాద్, ఐఎస్ సదన్ క్రాస్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సమస్యను అధిగమించడానికి ఈ స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు 2018-19 ఆర్థిక సంవత్సరంలోనే అంకురార్పణ జరిగింది. అయితే, ప్రారంభమైన తర్వాత ఈ ప్రాజెక్టు అనేక ఆటంకాలను ఎదుర్కొని తీవ్రంగా ఆలస్యమైంది. దీనికి ప్రధాన కారణం పాతబస్తీలోని అత్యంత రద్దీ ప్రాంతాల గుండా ఈ బ్రిడ్జి వెళ్తుండటంతో.. భూసేకరణ ప్రక్రియ జీహెచ్‌ఎంసీకి కత్తిమీద సాములా మారింది. వందలాది ప్రైవేటు ఆస్తులు, దుకాణాల యజమానులతో సంప్రదింపులు జరిపి వారికి పరిహారం చెల్లించి భూములు సేకరించడానికి దాదాపు రెండేళ్లకు పైగా సమయం పట్టింది. దీనికి తోడు కరోనా మహమ్మారి, లాక్‌డౌన్ల కారణంగా పనులు పూర్తిగా స్తంభించిపోయాయి. వలస కార్మికులు వారి స్వగ్రామాలకు తరలిపోవడం, స్టీల్ ముడిసరుకు కొరత ఏర్పడటం, మార్కెట్లో ఉక్కు ధరలు విపరీతంగా పెరగడంతో కాంట్రాక్ట్ సంస్థలు పనులను నత్తనడకన సాగించాయి. ఆ తదుపరి కాలంలో జీహెచ్‌ఎంసీలో ఏర్పడిన నిధుల కొరత, బిల్లుల చెల్లింపుల్లో జాప్యం, భూగర్భ డ్రైనేజీ మరియు తాగునీటి పైప్‌లైన్ల తరలింపు వంటి సాంకేతిక సమస్యల వల్ల కూడా ఈ బ్రిడ్జి ఏళ్ల తరబడి పెండింగ్‌లో పడింది. గత ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టుపై ప్రత్యేక శ్రద్ధ వహించి నిధులు విడుదల చేయడంతో ఎట్టకేలకు ఆరు సంవత్సరాల నిరీక్షణకు తెరదించుతూ వంతెన ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధమైంది.

## గుర్రంగూడ ఫారెస్ట్ లో కేబీఆర్ తరహా ఎకో పార్కు..

హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు తరహాలో అధునాతన ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ పనులు ప్రారంభించింది. సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న అటవీ భూమిలో 142 ఎకరాల విస్తీర్ణంలో రూ.15 కోట్ల వ్యయంతో ఈ పార్కును నిర్మిస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన ఈ ప్రాజెక్టును ఈ ఏడాది డిసెంబరు లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో సైక్లింగ్ ట్రాక్‌లు, వాక్‌వేలు, ధ్యానమందిరాలతో పాటు సందర్శకుల రద్దీ నియంత్రణకు ఐదు ప్రవేశ ద్వారాలను ఏర్పాటు చేయనున్నారు. హైదరాబాద్ నగర శివారులోని గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో అత్యాధునిక హంగులతో సరికొత్త ఎకో పార్కు ఏర్పాటుకు అటవీశాఖ ముమ్మర కార్యాచరణ ప్రారంభించింది. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కును తలపించేలా.. అన్ని రకాల అధునాతన సౌకర్యాలతో ఈ పార్కును రూపొందించనున్నారు. ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అధికారికంగా శంకుస్థాపన చేశారు. అనంతరం అటవీశాఖ అధికారులు ఇందుకు సంబంధించిన ప్రతిపాదిత నివేదికను ఉన్నతాధికారుల ఆమోదం కోసం పంపించారు. సుమారు రూ.15 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ఎకో పార్కు పనులను ఈ ఏడాది డిసెంబరులోపే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు గడువుగా నిర్దేశించుకున్నారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్ మొత్తం 424 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా.. అందులో 142 ఎకరాలను ప్రత్యేకంగా ఎకో పార్కు అభివృద్ధి కోసం కేటాయించారు. ఈ పార్కులో సందర్శకుల కోసం సైక్లింగ్ ట్రాక్‌లు, ఆహ్లాదకరమైన వాక్‌వేలు, ప్రశాంత వాతావరణంలో యోగా చేసుకునేందుకు ధ్యానమందిరాలను నిర్మించనున్నారు. అలాగే వివిధ అధికారిక, అనధికారిక సమావేశాల నిర్వహణకు వేదికలు, సందర్శకులు కూర్చుని మాట్లాడుకునేందుకు వీలుగా పచ్చిక బయళ్లలో ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేయనున్నారు. రోజుకు సుమారు 30 వేల మంది సందర్శకులు వచ్చినా తట్టుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో వందలాది మంది ఒకేసారి వస్తే ప్రవేశ ద్వారాల వద్ద రద్దీ ఏర్పడకుండా ఉండేందుకు వీలుగా పార్కుకు ఐదు వేర్వేరు చోట్ల ప్రధాన ప్రవేశ ద్వారాలను నిర్మిస్తున్నారు. వారాంతాల్లో కుటుంబాలతో గడిపేవారి కోసం ప్రత్యేక యాక్టివిటీ జోన్లు, పిల్లల వినోదం కోసం ప్లేజోన్లను కూడా సిద్ధం చేస్తున్నారు. గతంలో గుర్రంగూడ అటవీ ప్రాంతాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు తమ భూములంటూ ఆక్రమించుకుని కోర్టులను ఆశ్రయించి సుప్రీంకోర్టు వరకు వెళ్లారు.

## నేటి నుంచి రైతుభరోసా నిధుల విడుదల

-మొదటిపేజీ తరువాయి
రైతు భరోసా పంపిణీ సదస్సు
రైతు భరోసా నిధుల విడుదల కోసం రైతు ఆశీర్వాద సభకు బదులుగా హైదరాబాద్ శిల్పకళా వేదికలో 'రైతు భరోసా పంపిణీ సదస్సు'గా నిర్వహించాలని సీఎం రేవంత్?రెడ్డి ఆదేశించారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది.

**కొత్తవారికి కూడా పెట్టుబడి సాయం**
అన్నదాతలకు పెట్టుబడి సాయం కింద తొలి విడతలో 2 ఎకరాల వరకు నిధులు విడుదల చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రేపు 41.37 లక్షల మంది రైతుల కోసం, రూ.2,482 కోట్లు విడుదల చేస్తామన్నారు. మిగతా వారికి దశలవారీగా నిధులు జమచేస్తామని చెప్పారు. మొత్తంగా 10 రోజుల్లో అర్హులందరికీ పెట్టుబడి సాయం అందజేయనున్నారు. కొత్తగా పాసుబుక్‌లు వచ్చిన వారు జులై 5 లోపు రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తుమ్మల చెప్పారు.

**మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తాం**
వర్షాల వల్లనే రైతు ఆశీర్వాద సభ వేదికను మార్చినట్లు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈనెల 4 వరకు వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ చెప్పిందన్నారు. ఖమ్మం జిల్లా మధిరలో కచ్చితంగా సభ నిర్వహిస్తామని భట్టి చెప్పారు. రైతుభరోసా ముగింపు వేడుకగా సభ నిర్వహించే ఆలోచన చేస్తున్నామన్నారు. అనుకూల వాతావరణం చూసి మధిర సభ తేదీని మళ్లీ ప్రకటిస్తామని భట్టి వెల్లడించారు.

## 12 ఏళ్లలో తెలంగాణకు రూ.వేల కోట్ల నిధులు

-మొదటిపేజీ తరువాయి
రాంచందర్‌రావుతో కలిసి హాజరయ్యారు. తెలంగాణ అభివృద్ధికి పుష్కరకాలంగా మోదీ సర్కార్ రూ.వేల కోట్ల నిధులు ఇచ్చిందని గుర్తుచేశారు. విభజన రాజకీయాలు చేస్తున్నవారికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణలోనూ కమలం జెండా ఎగరాలని ఆకాంక్షిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణను పాలించిన బీఆర్‌ఎస్ సర్కార్ తమ కుటుంబ అభివృద్ధి కోసం పనిచేశారు తప్ప, ప్రజల ప్రగతిని పట్టించుకోలేదు. గద్దెనెక్కి మూడేళ్లవుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం సైతం అదే దారిలో పయనిస్తోంది. అలవిగానీ హామీలు ఇచ్చి మరిచిపోవడం తప్పిస్తే వాటిని అమలుచేయాలన్న సోయి వారికి లేదు. కుటుంబపాలన, అవినీతిని ప్రోత్సహించే రెండు పార్టీలు ప్రజా సంక్షేమాన్ని విస్మరించాయి.

క్షేత్రస్థాయిలోకి వెళ్లాలని నేతలు, శ్రేణులకు నితిన్ నబీన్ సూచించారు. మహిళలు, యువత, రైతులతో మమేకమై కేంద్రం అమలుచేస్తున్న పథకాలు, వాటి లబ్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేశారు. కాజీపేటలో రైల్వే వ్యాగన్ ఫ్యాక్టరీ పెట్టాలన్న పీవీ నరసింహరావు కలను సాకారం చేసిన ప్రధాని మోదీకి వరంగల్ ప్రజల తరఫున ధన్యవాదాలు చెబుతున్నానని నితిన్? నబీన్? తెలిపారు. ఈ ఫ్యాక్టరీతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు అపారంగా లభిస్తాయన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావించే వరంగల్ కార్పొరేషన్ పోరులో బీజేపీకి పట్టం కట్టాలని కోరుతున్నట్లు చెప్పారు.

**వరంగల్ అభివృద్ధి కోసం రూ.17 వేల కోట్లు**
రాష్ట్రాన్ని బీఆర్?ఎస్, కాంగ్రెస్ దోచుకున్నాయని, అభివృద్ధి కావాలంటే డబుల్ ఇంజిన్ సర్కార్ రావాల్సిందేనని కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతి జరగకుండా మోదీ సర్కార్ చర్యలు తీసుకుందని, ఈ విషయాన్ని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలని సూచించారు. పుష్కర కాలంలో వరంగల్ సమగ్రాభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం రూ.17 వేల కోట్లు మంజూరు చేసిందని గణాంకాలతో సహా వివరించారు.

**జనవరి నాటికి యూనిట్ ప్రారంభం**
వచ్చే జనవరి నాటికి రైల్ మాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ ప్రారంభమవుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎపుడొచ్చినా కాషాయ జెండా ఎగరటం ఖాయమని కేంద్రమంత్రులు ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో గిరిజన సంఘాల నాయకులు, మేధావులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో శాంతి, అభివృద్ధే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## రాష్ట్రంలో పోలిస్‌శాఖలో భారీగా బదిలీలు

**హైదరాబాద్:** తెలంగాణ పోలీస్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 36 మంది డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారులను బదిలీ చేస్తూ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ సోమవారం (జూన్ 29) అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ బోర్డు చేసిన సిఫార్సుల మేరకు ఈ బదిలీల ప్రక్రియ జరిగినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తాజా బదిలీల్లో ప్రధానంగా గత కొంతకాలంగా ఎలాంటి పోస్టింగ్స్ లేక హెడ్‌క్వార్టర్స్‌లో వెయిటింగ్‌లో ఉన్న 28 మంది సివిల్ డీఎస్పీ అధికారులకు కొత్త స్థానాలను కేటాయించారు. బదిలీ అయిన అధికారులను సీఐడీ, ఏసీబీ, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్, వివిధ జిల్లాల ఏసీపీ పోస్టులతో కూడిన కీలక విభాగాల్లో నియమించారు. బదిలీ అయిన అధికారులు అందరూ తక్షణమే తమకు కేటాయించిన కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించాలని డీజీపీ ఆదేశించారు

**తెలంగాణలో పలువురు ఐపీఎస్‌ల బదిలీలు**
తెలంగాణలో పలువురు ఐపీఎస్‌లు బదిలీ అయ్యారు. వరంగల్ సీపీగా శ్వేత, కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ ఎస్పీగా సింధుశర్మ, సీఐడీ ఎస్పీగా చెన్నూరి రూపేష్,వికారాబాద్ అడ్మిన్ ఎస్పీగా రాజేష్ మీరా నియామకమయ్యారు. సైబరాబాద్ జాయింట్ ట్రాఫిక్ సీపీగా సన్‌ప్రీత్ సింగ్, సికింద్రాబాద్ రైల్వే ఎస్పీగా వై.సాయిశేఖర్, సీఐడీ ఎస్పీలుగా చెన్నూరి రూపేష్, ప్రవీణ్ కుమార్, వికారాబాద్ అడ్మిన్ ఎస్పీగా రాజేష్ మీరా బదిలీ అయ్యారు. గోల్కొండ జోన్ డీసీపీగా రాఘవేందర్ రెడ్డి, ఏసీబీ జాయింట్ డైరెక్టర్‌గా చంద్రమోహన్,ఇంటలిజెన్స్ ఎస్పీగా రామ్ రెడ్డి , హైడ్రా అడిషనల్ కమిషనర్‌గా ఆనంద్ కుమార్,ఇంటలిజెన్స్ ఎస్పీగా ఇక్బాల్ సిద్దిఖీ మట్నత్తంగా 26 మంది అధికారుల బదిలీ జరిగింది.

## ఉద్యోగులకు మరో తీపి కబురు



-మొదటిపేజీ తరువాయి
చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇప్పుడు ఉద్యోగులకు మరో తీపి కబురు అందించింది రాష్ట్ర ప్రభుత్వం. ఉద్యోగులకు రూ. 2 వేల కోట్ల బకాయిలను తాజాగా విడుదల చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా నిధులను విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయంతో లక్షలాది మంది ఉద్యోగులు, రిటైర్డ్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇక పెండింగ్ లో ఉన్న బకాయిలను 100 రోజుల్లో రూ. 6 వేల కోట్లు విడుదల చేస్తామని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసిన విషయం తెలిసిందే.

అందులో భాగంగా గత నెల 29 న మొదటి విడతగా రూ. 2 వేల కోట్లను విడుదల చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఆ తర్వాత ఇవాళ రెండో విడతగా మరో రూ. 2వేల కోట్లను విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో మిగిలిన బకాయిలను కూడా క్రమ పద్ధతిలో క్లియర్ చేస్తామని ఆర్థిక శాఖ అధికారులు వెల్లడించడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
సోమవారం
29 జూన్ 2026

## సంపాదకీయం

# ఆర్థిక నేరాలకు అంతం ఎప్పుడు

దేశవ్యాప్తంగా ఏడాదికి లక్షల మంది సైబర్? నేరగాళ్ల మాయాజాలంలో చిక్కుతుంటే, హైదరాబాద్? కమిషనరేట్? పరిధిలోనే 30వేల ఫిర్యాదులు నమోదవుతున్నాయి. రోజూ సగటున రూ.కోటి నేరగాళ్ల పరం అవుతుండటమే కాదు. ఆ సొమ్ము సరిహద్దులు దాటిపోతుండటం దేశ ఆర్థిక భద్రతకు సవాలుగా నిలుస్తోంది. ఈ డబ్బులు డ్రగ్స్? అక్రమ రవాణా, ఉగ్రవాదం వంటి కార్యకలాపాలకు ఇంధనంగా మారుతుండటం జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమిస్తోంది. మరోవైపు ఈ అధిక క్రైమ్?రేట్?లో చాలా మంది చదువుకున్న యువకులే సైబర్? నేరాల బారినపడుతున్నారు. ఎంత అవగాహన కల్పించనప్పటికీ ఇంకా సైబర్? నేరాల బారినపడుతూనే ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రోజు సుమారు 2400 మంది 1930 నంబరును సంప్రదిస్తున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారు.. పోలీసు శాఖలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగానికి సంబంధించి డీజీపీ సీవీ ఆనంద్? ఇటీవల రాష్ట్రంలోని జిల్లాల ఎస్పీలు, కమిషనర్లు, ఎస్?హెచ్?ఓలతో వీడియో కాన్ఫరెన్స్? నిర్వహించారు.రోజుకు సగటున 108 ఆర్థిక నేరాలు నమోదవుతున్నాయని నేషనల్ క్రైం రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) 2024 గణాంకాలు చెబుతున్నాయి.దేశవ్యాప్తంగా నమోదవుతున్న వాటిలో 18 శాతం తెలంగాణలోనే నమోదవుతున్నట్లు ఈ నివేదికలో తేలింది.మిగిలిన రాష్ట్రాల కంటే తెలంగాణలో అవగాహన కార్యక్రమాలు ఎక్కువగా నిర్వహిస్తున్న కారణంగా పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు ఎక్కువగా ఉండటం దీనికి ఓ కారణంగా చెప్పవచ్చని ఎండ్ నౌ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనిల్ రాచమళ్ల బీబీసీతో చెప్పారు.ప్రజల్లో ఉన్న 'ఆశ'ను నేరగాళ్లు క్యాష్ చేసుకుంటూ.. ఆర్థిక నేరాలకు పాల్పడుతున్నారని పోలీసులు చెబుతున్నారు.ఇందులో ఇతర రాష్ట్రాల కంటే తెలంగాణలో అత్యధికంగా 39,127 ఆర్థిక నేరాలు రికార్డ్ అయ్యాయి.తెలంగాణలో అత్యధికంగా హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్లలోనే ఎక్కువగా ఆర్థిక నేరాలు రిపోర్ట్ అవుతున్నట్లు చెబుతున్నారు పోలీసులు."మోసపోయిన మొత్తం రూ.2 కోట్లకు పైబడి ఉంటేనే ఆర్థిక నేరాల విభాగం వద్ద రిపోర్ట్ అవుతున్నాయి. సైబరాబాద్‌లో రూ.3 కోట్లకు పైబడిన కేసులు రిపోర్ట్ అవుతుంటాయి. అంతకన్నా తక్కువ మొత్తంలో ఉంటే, అలాంటి నేరాలను స్థానిక పోలీస్ స్టేషన్లకు రిఫర్ చేస్తున్నాం" అని మనోహర్ చెప్పారు.ప్రజల్లో పెట్టుబడుల నుంచి రాబడిపై అత్యాశ పెరిగిపోయి ఈ తరహా మోసాలకు అవకాశం ఏర్పడుతోందని ఆయన చెప్పారు.హైదరాబాద్ పరిధిలో రూ.75 లక్షలకు మించిన మోసాల్లో ఆర్థిక నేరాల విభాగం కింద కేసులు నమోదు చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నారుఆర్థిక నేరాల్లో ఎక్కువగా ఫోర్జరీ, చీటింగ్, ఫ్రాడ్ కేసులే రిపోర్ట్ అవుతున్నట్లు ఎన్సీఆర్బీ నివేదిక చెబుతోంది."మా వద్దకు వస్తున్న చాలా కేసుల్లో.. ముందుగా బాధితులు కొంతమొత్తం పెట్టుబడి పెడుతున్నారు. దానిపై ఎంతో కొంత లాభం గడిస్తున్నారు. తర్వాత ఇంకొంత పెట్టుబడి పెడుతున్నారు. దానికీ లాభం వస్తోంది.మోసగాళ్లు అలా వారిని నమ్మించిన తర్వాత ఒకేసారి పెద్దమొత్తంలో పెట్టుబడి పెట్టమని చెబుతున్నారు. పెట్టిన వెంటనే నిందితులు బోర్డు తిప్పేయడం లేదా డబ్బుతో ఉడాయించడం జరుగుతోంది. అప్పుడు మోసపోయామని బాధితులు గ్రహిస్తున్నారు.పెట్టుబడికి తగ్గట్టుగా కాకుండా ఎక్కువగా లాభాలు ఇస్తున్నారంటేనే అనుమానించి, డబ్బులు పెట్టకపోతే మోసపోకుండా ఉండేందుకు వీలుంటుంది" అని ఒక పోలీసు అధికారి చెప్పారు.దేశవ్యాప్తంగా నమోదైన ఆర్థిక నేరాల్లో 1,92,382 నేరాలు ఈ మూడు కేటగిరీల్లోనే ఉన్నాయి. తెలంగాణ విషయానికి వస్తే 38,312 నేరాలు ఈ కేటగిరీలోనే నమోదయ్యాయి.ఇందులో రియల్ ఎస్టేట్ మోసాలు ఎక్కువగా రిపోర్ట్ అవుతున్నట్లు పోలీసులు చెబుతున్నారు.ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో ముందుగానే డబ్బులు కట్టించుకుని, తిరిగి సమయానికి ఫ్లాట్లు అప్పగించకపోవడంతో బాధితులు తాము మోసపోయామని గుర్తించి పోలీసులను ఆశ్రయిస్తున్నారు"ఆర్థిక, సైబర్ నేరాల విషయంలో అవగాహన బాగా పెరిగింది. కేసుల నమోదుకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటవుతున్నాయి. దానివల్ల ప్రజలు కూడా ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తున్నారు" అని చెప్పారు అనిల్ రాచమళ్ల.ఆర్థిక నేరాల్లో ఛార్జి షీట్ రేటు మాత్రం చాలా తక్కువగా ఉంటోంది. 2024లో ఛార్జి షీటు రేటు 39.8 శాతంగా ఉంది. ఇదే సమయంలో దేశవ్యాప్తంగా ఛార్జి షీటు రేటు 53.3 శాతంగా ఉంది."ఈ కేసుల విషయంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సి ఉంటుంది. వందల సంఖ్యలో బ్యాంకు ఖాతాలు పరిశీలించాల్సి ఉంటుంది. దర్యాప్తు విషయంలో ఆర్థికంగా అనేక విషయాలను జల్లెడ పట్టాలి. బాధితులు కూడా ఒక్కరు కాకుండా ఒకే కేసులో ఎక్కువ మంది ఉంటారు. దానివల్ల ఛార్జి షీటు విషయంలో ఆలస్యమవుతోంది" అని ఓ పోలీసు అధికారి అన్నారు. : ఇళ్లలో పని మనుషులుగా చేరి నేరాలకు పాల్పడుతున్న కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇలాంటి వారి వివరాలన్నీ సేకరించి భద్రపరచాలని డీజీపీ సీవీ ఆనంద్? పోలీసులను ఆదేశించారు. సీఐడీ విభాగం బలోపేతం, భవిష్యత్? కార్యాచరణ తదితర అంశాలపై చర్చించారు. వచ్చే అక్టోబరులో మహిళా పోలీసు కాన్ఫరెన్స్?, నవంబరులో పోలీస్? రీట్రీట్? నిర్వహించాలని నిర్ణయించారు. శాంతిభద్రతలు, క్షేత్రస్థాయి విధుల్లో మహిళా పోలీసులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని డీజీపీ సూచించారు.

# చైనాకు దీటుగా భారత్ పెద్ద డ్యామ్

**ఇటానగర్ :** టిబెట్ ప్రాంతంలోని యార్లుంగ్ త్సాంగ్పో నది దిగువ భాగంలో ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ డ్యామ్ నిర్మాణాన్ని చైనా అధికారికంగా ప్రారంభించింది. ఈ ప్రాజెక్ట్‌కు మేడోగ్ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ అని పేరు పెట్టారు. దీని సామర్థ్యం అక్షరాలా 60,000 మెగావాట్లు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏంటంటే, ఈ భారీ డ్యామ్ మన దేశ అరుణాచల్ ప్రదేశ్ సరిహద్దుకు కేవలం 50 కిలోమీటర్ల దూరంలోనే నిర్మితమవుతోంది. ఈ నిర్మాణం భారత్‌కు భద్రతా పరమైన , పర్యావరణ పరమైన సవాలుగా మారింది. దీనివలన రాబోయే రోజుల్లో ఈశాన్య రాష్ట్రాల్లో నీటి కొరత, వరదలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. చైనా చేస్తున్న ఈ జల కుట్రకు భారత్ అంతే వేగంగా, వ్యూహాత్మకంగా సమాధానం ఇవ్వడానికి సిద్ధమైంది. అరుణాచల్ లోని అప్పర్ సియాంగ్, సియాంగ్ జిల్లాల పరిధిలో సియాంగ్ అప్పర్ మల్టీపర్పస్ ప్రాజెక్ట్ ను వేగవంతం చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రభుత్వ రంగ దిగ్గజం ఎన్‌హెచ్‌పీసీ ఈ ప్రాజెక్ట్ బాధ్యతలను చూసుకుంటోంది. ఈ ప్రాజెక్ట్ గనుక పూర్తయితే ఇది భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద జలవిద్యుత్ కేంద్రంగా నిలుస్తుంది. దీని అంచనా వ్యయం సుమారు రూ.1.5 లక్షల కోట్లు కావడం విశేషం. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 47 బిలియన్ యూనిట్ల క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి కానుంది. టిబెట్‌లో ప్రవహించే యార్లుంగ్ త్సాంగ్పో నది.. భారతదేశంలోకి ప్రవేశించగానే సియాంగ్ నదిగా మారుతుంది. ఆ తర్వాత అస్సాంలోకి వెళ్లాక దీనినే బ్రహ్మపుత్ర నది అని పిలుస్తారు. అరుణాచల్ ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లోని కోట్ల మంది ప్రజల తాగునీరు, సాగునీరు, జీవనోపాధికి ఈ నదే ప్రధాన ఆధారం. నది ఎగువ భాగంలో చైనా అంత పెద్ద డ్యామ్ కట్టడం వల్ల నదీ ప్రవాహ దిశ పూర్తిగా మారిపోయే ప్రమాదం ఉందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల స్థానిక పర్యావరణ వ్యవస్థ దెబ్బతినడమే కాకుండా, దిగువన ఉన్న భారతీయ ప్రాంతాలలో అకస్మాత్తుగా ఊహించని వరదలు వచ్చే ముప్పు ఉంది. అయితే. భారత్ నిర్మించబోయే సియాంగ్ ప్రాజెక్ట్ కేవలం కరెంట్ ఉత్పత్తి కోసమే కాకుండా.. చైనా ఒకేసారి నీటిని వదిలితే వచ్చే కృత్రిమ వరదలను అడ్డుకోవడానికి, నీటిని నిల్వ చేయడానికి ఒక రక్షణ కవచంలా ఉపయోగపడనుంది. సరిహద్దులు దాటి ప్రవహించే నదులపై భారీ ప్రాజెక్టుల విషయంలో పారదర్శకత పాటించాలని, సమాచారాన్ని పంచుకోవాలని, ముందస్తు సంప్రదింపులు జరపాలని భారత్ చైనాపై ఒత్తిడి తెచ్చింది. కానీ, ఇప్పటివరకు చైనా స్పందించలేదు.చైనా తీరుపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తం చేసింది.



ఎగువ ప్రాంతాల్లో నిర్మించే ప్రాజెక్టుల వల్ల దిగువన ఉన్న ప్రాంతాలకు హాని కలగకుండా చూసుకోవాలని చైనాకు సూచించింది.

### మోడీని కలిసిన టిబెట్ ప్రధాని

భారత్ అలా కాదు. అమెరికా మాదిరిగా ప్రయోజనాలు ఉండవు .. ప్రపంచం బాగుంటే చాలు అనుకునే టైపు. అలాగని తనను ఇబ్బంది పెట్టే దేశాలను భారత్ వదిలిపెట్టదు. అవసరమైతే అంతు చూస్తుంది. అంతానికి పోరాడుతుంది. బర్మా విషయంలో కూడా భారత్ అలానే వ్యవహరించింది. మన దేశానికి వ్యతిరేకమైన శక్తులను చైనా పెంచి పోషించి బర్మా తోలేది. బర్మా కేంద్రంగా ఆ శక్తులు మనమీద దాడులు చేసేవి. కాలా అనుగుణంగా భారత్ మారింది. ముఖ్యంగా గడిచిన 12 సంవత్సరాల కాలంలో భారత్ ఇంటి దొంగలను హతమార్చే పని పెట్టుకుంది. బర్మాలో దాగివున్న వ్యతిరేక శక్తులను తొక్కినార తీసింది. దీనికి బర్మా సహాయం కూడా తీసుకుంది. బర్మాలో ఒక దరిద్రమైన వ్యవస్థ ఉంది. అక్కడ సైనిక అధికారులే నేరుగా అధికారంలోకి వస్తుంటారు. గతంలో నోబెల్ శాంతి బహుమతి విజేత సూకీ బర్మా అధిపతి అయింది. అయితే అక్కడి సైనిక అధికారులు ఆమెను జైల్లో వేశారు. ఇప్పటికి జైలు నుంచి ఆమె విడుదల కాలేదు.ఇటీవల బర్మాకు కొత్త అధినేత వచ్చారు. ఆయన పేరు ఆంగ్ హ్లాయింగ్. ఆయనకు మన రక్షణ సలహాదారు అజిత్ దోవల్ ఫోన్ చేశారు. వెంటనే బర్మా అధినేత ఇండియాకు వచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఆ తర్వాత అనేక రకాల చర్చలు జరిగాయి. అనంతరం సానుకూల దృక్పథంతో బర్మా అధిపతి వెళ్ళిపోయారు.. అజిత్ దోవల్ ఫోన్ చేయడానికి ప్రధాన కారణం.. ఇండియా, బర్మా, థాయిలాండ్ వరకు నిర్మించే కాలదాన్ ప్రాజెక్టు గురించి ప్రధానంగా చర్చించారు. దీనివల్ల భారత్ నుంచి ఈశాన్య రాష్ట్రాలకు, దేశాలకు సరుకులు రవాణా చేయడం ఈజీ అయిపోతుంది. ఈ ప్రాజెక్టులో భాగస్వామి అవుతారా.. లేదా అనే విషయం మీద క్లారిటీ తీసుకోవడానికి బర్మా అధినేతను ఇండియాకు పిలిపించారు.చైనా మాటలు నమ్మకుండా.. చైనా చెప్పినట్టు వినకుండా బర్మా అధినేత ఇండియాకు వచ్చారు. వాస్తవానికి బర్మాకు అధినేత అయిన తర్వాత ఆయన బీజింగ్ వెళ్లాల్సి ఉండేది. అజిత్ దోవల్ నుంచి ఫోన్ రాగానే బర్మా అధినేత నేరుగా ఇండియాకు వచ్చారు.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో అనేక రకాల చర్చలు జరిపారు. చివరికి సానుకూల దృక్పథంతో బర్మా తిరిగి వెళ్ళిపోయారు. సాధారణంగా ఇటువంటి వ్యవహారాలలో చైనా ముందుంటుంది. కానీ ఈసారి చైనాను మించిపోయింది భారత్. ఫారిన్ పాలసీలో సరికొత్త మార్పు తీసుకురావడంతో చైనా తలలు పట్టుకుంటుంది. ఎందుకంటే కాలాదాన్ అందుబాటులోకి వస్తే లాజిస్టిక్ రంగంలో భారత్ తిరుగులేని స్థానంలో ఉంటుంది. అది తెలిసే చైనా తెగ ఉడికిపోతుంది.

## ఇండియాలో హైడ్రోజన్ ట్రైన్స్..

రోజురోజుకు మనుషుల సంఖ్య పెరిగిపోతుంది. ప్రయాణాలు చేసే వారి సంఖ్య కూడా అధికమవుతోంది. ప్రజల అవసరాలు పెరిగిపోతున్నాయి. ప్రజలు ఉపయోగించే సరుకులు కూడా అదే స్థాయిలో ఎక్కువ అవుతున్నాయి. ఇలాంటి అప్పుడు సరుకు రవాణా చేయడం కష్టతరంగా మారుతుంది. దీనికి తోడు రైళ్లకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది.మనదేశంలో అనేక విధాలుగా విద్యుత్ తయారవుతున్నప్పటికీ.. ఎక్కువగా థర్మల్ విధానంలోనే కరెంటు తయారు చేస్తున్నారు. థర్మల్ కరెంటు తయారీకి బొగ్గు.. నీరు అవసరం. బొగ్గు అనేది ఒక పరిమితమైన వనరు. ఇలానే తవ్వుకుంటూ పోతే భవిష్యత్తులో బొగ్గు అనేది ఉండదు. అప్పుడు భవిష్యత్ తరాలు ఇబ్బంది పడుతుంటాయి. అందువల్లే సరికొత్త ఆవిష్కరణ చేశారు శాస్త్రవేత్తలు.విద్యుత్ కాకుండా.. బొగ్గును మండించడం ద్వారా కాకుండా.. హైడ్రోజన్ ద్వారా రైళ్ళను నడిపిస్తున్నారు.. ప్రపంచంలో ఇప్పటికే జర్మనీ, చైనా, జపాన్, అమెరికా దేశాలలో హైడ్రోజన్ తో నడిచే రైళ్లు ఉన్నాయి. అక్కడ అవి విజయవంతంగా కార్యకలాపాలు సాగిస్తున్నాయి.. డీజిల్ రైళ్లకు ఇవి ప్రత్యామ్నాయం. వీటివల్ల ఇంధనం ఖర్చు తగ్గుతుంది. కాలుష్యం ఉండదు. శబ్ద కూడా తక్కువ. కేవలం 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలోనే ఇంధనం నింపొచ్చు.. దీనివల్ల ఒక్కసారి నింపితే రైలు 1000 కిలోమీటర్ల వరకు ప్రయాణం సాగిస్తూ ఉంటుందిమనదేశంలో సరుకు రవాణా రైళ్ల ద్వారానే అధికంగా సాగుతూ ఉంటుంది.

# సమైక్యతా మార్గంలోనే వికసిత భారత్

'భారతదేశం అంతటి గొప్ప దేశం మరొకటి ఉండదు. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాలు, భాషలు, యాసలు, ఆచారాలతో ఎంతో విభిన్నమైన మనుషులను ఏకతాటిపైకి తెచ్చింది మన దేశం. భిన్నత్వంలో ఏకత్వం అనే గొప్ప భావనకు మించింది ఏముంటుంది?' -- ఇవి జూన్ 15న ఢిల్లీలో 'జాతీయ సమైక్యత కోసం... సేన ప్రస్థానం' సమావేశం నిర్వహించిన జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌గారు చేసిన వ్యాఖ్యలు. "నేను ప్రతీసారీ ప్రాంతీయతను విస్మరించని జాతీయవాదం అని ఎందుకు అంటానంటే మన మొదటి ప్రాధాన్యం దేశం అవ్వాలి. తర్వాతే ప్రాంతం. అయితే కొన్ని దశాబ్దాలుగా ఈ స్ఫూర్తి మెల్లగా తగ్గుతోంది. ఇది చాలా ప్రమాదకరం" అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మతతత్వం, ప్రాంతీయతత్వం, కులతత్వం, భాషా దురభిమానం పెరిగిపోతున్న నేటి రోజుల్లో పవన్ కళ్యాణ్ వ్యాఖ్యల వెనుక ఆవేదనను అర్థం చేసుకోవచ్చు.

నిజానికి ఇన్ని విభిన్న కులాలు, మతాలు, సంస్కృతులు, సంప్రదాయాలు, ఆహారపు అలవాట్లు ఉన్న దేశం ప్రపంచంలో మరొకటి లేదు. ఇన్ని వైవిధ్యాలు ఉన్నా కూడా ఒక దేశంగా మనం ఉన్నామంటే కారణం మనలోని భిన్నత్వంలోని ఏకత్వ ?స్ఫూర్తే! భారతదేశం అంటే కేవలం భూభాగం కాదు, అది 140 కోట్ల ప్రజల గుండె చప్పుడు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, గుజరాత్ నుంచి నాగాలాండ్ వరకు- భిన్నత్వమే మన బలం. స్వాతంత్ర్యం వచ్చే నాటికి భారత్‌లో 565 సంస్థానాలు ఉండేవి. ఇవి ప్రత్యేక దేశాలుగా మారితే భారత్ ముక్కలవుతుందని గ్రహించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ రెండేళ్లలో అన్నింటినీ భారత్‌లో విలీనమయ్యేలా కృషి చేశారు. అందుకనే ఆయన్ను భారత సమైక్యతా శిల్పి అని గౌరవించుకుంటాం. జాతీయ సమగ్రత పట్ల, సుపరిపాలన పట్ల, ప్రజాసేవ పట్ల ఆయన అచంచల నిబద్ధత భావి తరాల వారికి స్ఫూర్తిదాయకం. భారత రాజ్యాంగం జాతీయ సమైక్యతకు ప్రాధాన్యమిచ్చి భారతదేశాన్ని ఒక సర్వసత్తాక, సామ్యవాదం, లౌకిక, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రకటించింది. అయితే ఈ మధ్య కాలంలో 'భారతదేశం నా మాతృ భూమి, భారతీయులందరూ నా సహోదరులు' అన్న ప్రతిజ్ఞ నోటిమాటగానే మిగిలిపోతున్నది. భారతావనికి మూలమైన భిన్నత్వంలో ఏకత్వ భావన బీటలు వారుతుంది. భాష, యాస, ఆహారపు అలవాట్లు, వ్యక్తిగత విశ్వాసాలు, ప్రాంతాల ఆధారంగా తోటి భారతీయులను చిన్నచూపు చూస్తూ అపహాస్యం చేసే వికృత ధోరణి పెరిగిపోతుంది. జాతీయ సమైక్యత, సమగ్రతలను అవి ప్రమాదంలో పడేస్తున్నాయి.



కులాభిమానం పేరుతో ఇతర కులాలను తక్కువ చేసి మాట్లాడడం, మతాన్ని రాజకీయంగా వాడుకోవడం, ప్రాంతీయాభిమానం ముసుగులో ప్రాంతాల మధ్య విద్వేషాలు రగిలించడం, ఒక భాషపైన, యాస పైన అతి ప్రేమ, అభిమానం చూపిస్తూ ఇతర భాషల్ని తక్కువగా చేసి మాట్లాడడం నేడు చూస్తున్నాం. వసుధైక కుటుంబంగా ఉండాల్సిన మన దేశంలో... దేశాన్ని బలహీనపరిచే "మా రాష్ట్రం, మా ప్రజలు, మా భాష, మా నీళ్లు" అనే సంకుచితత్వాన్ని కొందరు నాయకులే పెంచి పోషిస్తున్నారు. ఈ అతి తత్వాలు దేశ సమగ్రతకు ముప్పుగా మారుతున్నాయి. మరోవైపు దేశాన్ని అస్థిరపరిచడమే ఏకైక లక్ష్యంగా పనిచేసే 'సీమాంతర ఉగ్రవాదం' మన జాతీయ సమగ్రతకు పెను సవాలుగా మారుతోంది. కొంతమంది రాజకీయ నాయకులు తమ స్వప్రయోజనాల సాధన కోసం నేరస్తులతో సంబంధాలను కొనసాగిస్తూ, దేశ సమగ్రతకు విఘాతం కలిగిస్తున్నారు. ఈ విషయాన్ని వోహ్రా కమిషన్ ఆధారాలతో సహా రుజువు చేసింది.

విభజన వాదులతో జాతి సమైక్యతకు వాటిల్లిన ముప్పు నుంచి దేశాన్ని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత నేటి యువత పైనే ఉంది. సమాజంలో మార్పు కోరుకుంటే రాదు- ప్రయత్నిస్తేనే వస్తుందని యువత తెలుసుకోవాలి. "మా సమస్యకి వేరెవరో కారణం, ఎవరో నష్టపోతేనే మేము ప్రయోజనం పొందగలము" అనే ధోరణి అనాగరిక ప్రజాస్వామ్య సంస్కృతే తప్ప, ఆధునిక ప్రజాస్వామ్యం అనిపించుకోదని గ్రహించాలి. ఇక్కడ "నేను తెలుగువాడిని", "నేను తెలంగాణవాడిని" అనే భావన కంటే "నేను భారతీయుడిని" అనే భావన గొప్పది కావాలి. వేరే ప్రాంతం వారనో, వేరే భాష మాట్లాడుతున్నారనో, చూడడానికి భిన్నంగా కనిపిస్తున్నారనో సాటి భారతీయుల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తే- భారత జాతీయతను అవమానించినట్లే!

విపరీతమైన ప్రాంతీయతత్వం దేశ సమైక్యతకు భంగం కలిగిస్తుంది. భారత్‌ను తమ గుప్పెట్లో పెట్టుకోవడానికి బ్రిటిష్‌వారు 'విభజించు, పాలించు' సూత్రానికి అనుగుణంగా ప్రాంతీయతత్వాన్ని ప్రోత్సహించడమే భారత్ -- పాకిస్థాన్ విడిపోవడానికి దారితీసింది. మరోసారి అటువంటి పరిస్థితులు తలెత్తకుండా యువత అప్రమత్తంగా ఉండాలి. రాష్ట్రాల సమాహారమైన మన దేశంలో ఎక్కడివారైనా, ఎక్కడికైనా వెళ్లి, స్థిరపడి, శాంతియుతంగా పనిచేసుకోవచ్చని రాజ్యాంగం స్పష్టం చేసింది. రాజ్యాంగ స్ఫూర్తికి కట్టుబడి ఉండడం భారతీయులందరి కర్తవ్యం. ఏ దేశానికైనా బలం ఆ దేశ ఐక్యతే! ఏ దేశాభివృద్ధి అయినా అక్కడి ప్రజల ఐక్యతతోనే సాధ్యమవుతుంది. జాతీయ సమగ్రత అనేది వివిధ రకాల పువ్వులతో కట్టిన దండ లాంటిది. ప్రతి పువ్వు రంగు, వాసన వేరు. కానీ దారం ఒక్కటే. ఆ దారం తెగితే దండ విడిపోతుంది. ఆ దారమే "భారతీయత".

# విద్యార్థులు మంచి మార్గంలో నడవాలి..

# డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి





తల్లిదండ్రుల ఆశయాలకు అనుకులంగా ముందుకుసాగాలి..

రాష్ట్రసంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

**నవగీతం,జగిత్యాల:** యువత చదువుకునే సమయంలో డ్రగ్స్ జోలికి పోవద్దని, విద్యార్థులు మంచి మార్గంలో నడవాలని రాష్ట్రసాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మారక ద్రవ్య దుర్వినియోగం, అక్రమ రవాణ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని సుమంగళి గార్డెన్స్ లో నిర్వహించిన కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరైయ్యారు. ఈసందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీరేవంత్ రెడ్డి గారు తెలంగాణను డ్రగ్స్ రహిత తెలంగాణగా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్ దందాపై ఉక్కు పాదం మోపడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈగల్ టీంలను ఏర్పాటు చేసిందని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ కు దూరంగా ఉండాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపునిచ్చారు. యువతే దేశ భవిష్యత్తు అని, వారు మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉంటూ తమ లక్ష్యాలను



సాధించాలని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న ఆశలు, నమ్మకాలను నిలబెట్టేలా ప్రతి విద్యార్థి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. "ఒక్కసారి మాత్రమే తీసుకుంటే ఏమవుతుంది" అనే నిర్లక్ష్య ధోరణే జీవితాన్ని నాశనం చేసే స్థాయికి తీసుకెళ్తుందని, డ్రగ్స్‌కు బానిసైన తర్వాత దాని నుంచి బయటపడటం ఎంతో కష్టమని మంత్రి హెచ్చరించారు. అందువల్ల యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. కళాశాలలు, విద్యాసంస్థలు లేదా పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం లేదా వినియోగం జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని మంత్రి కోరారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరిస్తేనే మత్తు రహిత సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. అనుకోకుండా మత్తు పదార్థాలకు బానిసైన వారికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన డీ-అడిక్షన్ సెంటర్ల ద్వారా వైద్య చికిత్సతో పాటు కౌన్సెలింగ్ సేవలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. అలాంటి వారు ఎలాంటి సంకోచం లేకుండా ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తదితరులతో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయించి, "నషా ముక్త్ భారత్" పోస్టర్‌ను ఆవిష్కరించారు.

## గ్రీవెన్స్ డేలో ప్రజా ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్



**నవగీతం, జగిత్యాల:** ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా గ్రీవెన్స్ డే కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ప్రజల నుండి వచ్చిన పలు ఫిర్యాదులను స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సుమారు 13 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వివరంగా తెలుసుకున్నారు.ప్రతి ఫిర్యాదును న్యాయబద్ధంగా, పారదర్శకంగా విచారించి బాధితులకు త్వరితగతిన న్యాయం అందేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. చట్ట పరిధిలో పరిష్కరించగల సమస్యలను ఆలస్యం లేకుండా వెంటనే పరిష్కరించాలని, విచారణ ప్రక్రియలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పరిశీలించిన సర్పంచ్




**నవగీతం,మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రం లో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ను మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ పాలక వర్గం ఆధ్వర్యంలో పరిశీలించి,కార్యక్రమం పై సంతృప్తి వ్యక్తం చేసారు.ఈ సందర్భంగా చిట్యాల లక్ష్మణ్ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతీ ఒక్కరూ తప్పకుండా ఈ ప్రత్యక్ష సమగ్ర సవరణ కార్యక్రమం ఉపయోగించుకోవాలని, ఈ సర్వేకు బీ.ఎల్.ఓ లు ఇంటింటికీ వచ్చి ముద్రిత (ఎన్యుమరేషన్) ఫారాలను అందజేస్తారు.అధికారులు ఇచ్చిన ఫారంలో మీ ఓటరు వివరాలను, ఫోటోను సరి చూసుకోవాలని,ఎలాంటి మార్పులు, చేర్పులు ఉన్నా తగిన ధ్రువీకరణ పత్రాలు (ఆధార్, పాన్ కార్డ్, ఓటరు గుర్తింపు కార్డు తదితరులు) సమర్పించాలి.అనంతరం ఫారంపై సంతకం చేసి, వివరాలను తిరిగి బీ.ఎల్.ఓ కు అందించాలి అని అన్నారు.ఈ కార్యక్రమం లో జీ.పీ.ఓ జల,అంగన్వాడీ కార్యకర్త రాధ,వార్డు సభ్యులు ముష్కరి రమేష్,కొంపల్లి రాకేష్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## సర్ ప్రక్రియపై బిఎల్ఏ కార్యకర్తలతో ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అవగాహన సమావేశం





**నవగీతం, కోరుట్ల:** కోరుట్ల మండలం జోగిన్‌పల్లి, పైడిమడుగు గ్రామాల్లో సర్ ప్రక్రియపై కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ బూత్ లెవల్ ఏజెంట్లు పార్టీ కార్యకర్తలతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బూత్ స్థాయిలో ప్రజలకు సరైన అవగాహన కల్పిస్తూ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు.సర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల వివరాల పరిశీలన, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల విషయంలో నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారికి అవసరమైన సమాచారం అందిస్తూ సహకరించాలని బి ఎల్ ఏ లకు సూచించారు. బూత్ స్థాయి కార్యకర్తలు పార్టీకి, ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తూ ప్రతి ఇంటికి చేరుకుని ఓటరు జాబితా ప్రక్రియపై అవగాహన కల్పించాలని ఎమ్మెల్యే గారు పేర్కొన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో కీలకమైందని, ప్రతి అర్హుడైన పౌరుడికి తన ఓటు హక్కు సక్రమంగా ఉండేలా చూడటం అందరి బాధ్యత అని అన్నారు. అలాగే త్వరలోనే దీ=హా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కానుందని ఎమ్మెల్యే సంజయ్ గారు తెలిపారు.. ప్రతి కార్యకర్త ఉత్సాహంగా పాల్గొని పార్టీ సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, గ్రామ గ్రామాన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు.ప్రజలతో నిరంతరం మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు..ఈ సమావేశంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు,బి ఎల్ ఏ లు,కార్యకర్తలు పాల్గొన్నారు...

## కొండగట్టు 42వ గిరిప్రదక్షిణలో మొక్కలు నాటి, విత్తన బంతులు విసిరిన భక్తులు

పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టిన సురేష్ ఆత్మారామ్ మహారాజ్





**నవగీతం,కొడిమ్యాల ప్రతినిధి:** జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేట గ్రామంలోని కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానం 42వ గిరిప్రదక్షిణ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు.గిరిప్రదక్షిణ ప్రారంభానికి ముందు దిగువనున్న శ్రీ ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజ్య గురువులు సురేష్ ఆత్మారామ్ మహారాజ్ ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ తయారు చేసిన సీడ్ బాల్స్ (విత్తన బంతులు)ను భక్తులతో కలిసి అడవిలో విసిరి, రావి మొక్కను స్వయంగా నాటి పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా గురువు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, పచ్చని ప్రకృతిని అందించాలంటే పర్యావరణ పరిరక్షణలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పూట్కూరి, బత్తిని శ్రీనివాస్ గౌడ్, ఇజ్జగిరి శ్రీనివాస్, చెన్న దేవేందర్, పాక శ్రీనివాస్, గౌతమ్ విశిష్ట, కొండూరి సురేష్, సతీష్ రావు తదితరులు పాల్గొన్నారు.కాగా, 42వ కొండగట్టు గిరిప్రదక్షిణలో వివిధ జిల్లాల గ్రామాల నుంచి సుమారు 20 వేల మంది భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని గిరిప్రదక్షిణ నిర్వహించారు.

## గౌరవ వేతనం వెంటనే విడుదల చేయాలి -

పిఎస్ హెచ్ఎంఏ అధ్యక్షులు అచ్చ విజయ భాస్కర్



**నవగీతం,ఇబ్రహీంపట్నం:** వేసవి సెలవుల సమయంలో ప్రభుత్వం అప్పగించిన జనాభ లెక్కల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన ఉపాధ్యాయులకు ఇప్పటివరకు గౌరవ వేతనం విడుదల కాకపోవడం బాధాకరమని జగిత్యాల జిల్లా ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్స్ అసోసియేషన్ పి ఎస్ హెచ్ ఎం ఏ,జిల్లా అధ్యక్షులు అచ్చ విజయ భాస్కర్, అన్నారు. ప్రభుత్వం అప్పగించిన విధులను ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేసిన ఉపాధ్యాయుల శ్రమను గుర్తిస్తూ, వారికి రావలసిన గౌరవ వేతనాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల న్యాయమైన హక్కులను పరిరక్షించే దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు .

## ఎమ్మెల్యే డా. సంజయ్ కృషితో రిగ్గు బోరు మంజూరు




**నవగీతం, మల్లాపూర్:** మల్లాపూర్ మండలంలోని రాఘవపేట గ్రామంలో కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కల్వకుంట్ల ప్రత్యేక చొరవతో రిగ్గు బోరు కి రెండు లక్షల రూపాయలు మంజూరు చేయగా నేడు గ్రామంలోని గ్రామ పంచాయితీకి దగ్గరలో బోరు వేయగా గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు.చాలా రోజులుగా నీళు లేక ఇబ్బంది పడుతున్న ప్రజలని చూసి మంజూరు చేసిన ఎమ్మెల్యే కి గ్రామ ప్రజలు, వార్డ్ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మద్దెల నర్సయ్య, మాజీ ఉప సర్పంచ్ అమీన్ వార్డ్ సభ్యులు మాధం సాగర్, వార్డ్ ఇంచార్జి లోక రవి బీఆర్ఎస్వీ నియోజకవర్గ నాయకులు బైరి రవికుమార్ యాదవ్ నాయకులు రాకేష్ యాదవ్, వెంకట్ స్వామి, రవి, తిరుపతి, నరేష్, నారాయణ మరియు వార్డ్ మహిళలు పాల్గొన్నారు.

## అత్యవసర సమయంలో రక్తదానం చేసిన రిపోర్టర్ శ్రీనివాస్



**నవగీతం, మెట్ పల్లి:** మెట్ పల్లి పట్టణంలోని వెంకట అలేఖ్య నర్సింగ్ హోమ్ లో చికిత్స పొందుతున్న స్వప్న అను మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం అని పేషెంట్ కుటుంబ సభ్యులు డోనర్ కోసం వెతుకుతూ రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ ని సంప్రదించగా మెట్ పల్లి పట్టణానికి చెందిన ప్రజాజ్యోతి రిపోర్టర్ - ఓంకారి శ్రీనివాస్ కి సమాచారం తెలుపగ శ్రీనివాస్ వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది.అత్యవసరం సమయంలో వెంటనే స్పందించి రక్తదానం చేసి ప్రాణాదాతగా నిలిచినా ఓంకారి శ్రీనివాస్ ని బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రక్తదాతల అనుసంధాన కర్త ఉదయ్ కుమార్ పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
సోమవారం
29 జూన్ 2026

# సీఎం రేవంత్ రెడ్డి నియోజకవర్గం కొడంగల్‌లో కర్ణాటక ఓటర్లు

**సెడం నియోజకవర్గం నుంచి 11 వేల మంది కొడంగల్ లో ఓటర్లుగా ఉన్నారు**

**కొడంగల్ లో 22 వేల డూప్లికేట్ ఓట్లు ఉంటే, 11 వేలు కర్ణాటక ఓటర్లు ఉన్నారు.**

**సరిగ్గా అంతే మార్జిన్ తో ఆయన గెలిచారు. అంటే సీఎంకు ఈసీ ఫేవర్ చేసిందా?**

**వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ ఓటు అనే విధానం ఉండాలి**

**తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత**

**హైదరాబాద్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పై మాకు చాలా అనుమానాలున్నాయి. సాధారణంగా ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ ను ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి తీసుకోవాలి. కానీ 2025 జనవరి నుంచి వీళ్లు ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ పాయింట్ తీసుకుంటున్నారు. ఏటా నిర్వహించే ఎస్ఎస్ఆర్ రిఫరెన్స్ పాయింట్ అయిన జనవరి 1 వ తేదీనే తీసుకోవాలి. కానీ అలా కాకుండా గతేడాది జనవరి 1 తేదీని ఎస్ఐఆర్ కు రిఫరెన్స్ పాయింట్ చేశారు. ఐతే మా భోదన్ లో పరిస్థితి ఎలా ఉందని తెలుసుకుంటే అక్కడ 7 వేలకు పైగా ఓట్లను తీసేశారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. వాళ్లు షిఫ్ట్ అయ్యారా, చనిపోయారా? డూప్లికేషన్ ఓట్ల అనేది ఈసీ చెప్పటం లేదు. జనవరి 1, 2025 నుంచి ఇప్పటి వరకు ఏడాదిన్నరలో ఒక్క భోదన్ నియోజకవర్గంలో 7 వేల ఓట్లు డిలీట్ అయ్యాయి. ఈ 7 వేల ఓట్లకు సంబంధించి స్పష్టమైన క్లారిటీ ఇవ్వాలని మేము ఈసీ ని కోరుతున్నాం. సినిమా యాక్టర్ ప్రకాష్ రాజ్ కి మూడు రాష్ట్రాల్లో ఓటు ఉందని చెబుతున్నారు. ఆ ఓట్లను తొలగించేందుకు ఏడు ఏళ్లు పడితే భోదన్ లో మాత్రం ఏడాదిన్నరలో 7 వేల ఓట్లు తొలగించారు. ఒక నియోజకవర్గంలో 2 శాతం కన్నా ఎక్కువ ఓట్లను తొలగించాల్సి వస్తే తొలిగించే ప్రతి ఓటరుకు మూడుసార్లు నోటీసులు ఇవ్వాలని ఈసీ నిబంధన ఉంది. కానీ ఆ విధంగా ఎవరికీ నోటీసు ఇవ్వలేదు. ఇస్తే ఈసీ దీని గురించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలి. మా భోదన్ లో 7 వేల ఓట్లు తొలగించటంతో మేము మిగతా నియోజకవర్గాల్లో అలాగే జరిగిందా అన్న అనుమానంతో కొడంగల్ లో చెక్ చేశాం. అక్కడ కేవలం 808 ఓట్లు మాత్రమే డిలీట్ చేశారు. భోదన్ లో ఏడు వేలు ఎలా? కొడంగల్ లో 8 వందలు మాత్రమే ఎలా? కొడంగల్ లో దాదాపు 22, 433 డూప్లికేట్ ఓట్లు కూడా ఉన్నాయి. అందులో దాదాపు వెయ్యి వరకు మేము ప్రింట్ తీశాం. 2018 లో కొడంగల్ ఉన్న ఓట్ల సంఖ్యతో పోల్చుకుంటే 2023 నాటికి దాదాపు 30 వేల ఓట్లు పెరిగాయి. పైగా కొడంగల్ కు పక్కనే ఉన్న కర్ణాటకలోని సెడం అనే నియోజకవర్గం నుంచి 11 వేల మంది ఓటర్లు కొడంగల్ లో ఉన్నారు. సెడంలోనూ కొడంగల్ లోనూ 11 వేల మంది ఓటర్లు ఎలా ఉంటారని ప్రశ్నించారు.




కొడంగల్ లో ఉన్న డూప్లికేషన్, అదే విధంగా సెడం కు సంబంధించిన 11 వేల ఓట్లు కలిపితే 33 వేల ఓట్లు అవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో దాదాపు 33 వేల ఓట్ల మెజార్టీతోనే గెలిచారు. అంటే డూప్లికేట్, అక్రమంగా రిజస్టర్ చేసుకున్న ఓట్లతో గెలుపు, ఓటములు నిర్ణయించబడుతున్నాయి. దీన్ని బట్టి చూస్తే ఎన్నికల సంఘం ముఖ్యమంత్రికి ఏమైనా ఫేవర్ చేసిందా అనే అనుమానం వస్తోంది. రాష్ట్రంలోని రెండు నియోజకవర్గాల్లోనే ఇలా ఉంటే మిగతా నియోజకవర్గాల్లో పరిస్థితి ఏంటీ?కర్ణాటక నుంచి తెలంగాణకు డబ్బులు మాత్రమే కాదు. ఓట్లు కూడా ట్రాన్స్ ఫర్ అయ్యాయా? కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మన దేశంలో వేరే దేశంలో వాళ్లకు ఓట్లు ఉండవద్దని అంటున్నారు. దానికి మేము అంగీకరిస్తాం. కానీ ఒక రాష్ట్రంలో ఓటు ఉన్న వాళ్లకు మరొక రాష్ట్రంలో ఉండవచ్చా? మీరు ఒక రాష్ట్రంలో వేరే దేశ పౌరుడి ఓటు తొలగిస్తే వాళ్లు మరొక రాష్ట్రానికి వచ్చి నమోదు చేసుకోరా? అసలు ఇంటర్ స్టేట్ లో ఓట్ల డూప్లికేషన్ ను ఏరివేసేందుకు ఈసీ దగ్గర మెకనిజమే లేదు. అలాంటప్పుడు 14 వందల కోట్లు పెట్టి ఎస్ఐఆర్ చేయటం వల్ల ప్రయోజనం ఏంటీ? ఈ ఎస్ఐఆర్ ద్వారా దేశంలో డూప్లికేషన్ ఓట్లు ఉండకుండా ఫ్రీ అండ్ ఫెయిర్ ఎలక్షన్ నిర్వహించే పరిస్థితి రావాలి. వన్ నేషన్, వన్ ఎలక్షన్, వన్ ఓటు అనే పరిస్థితి ఉండాలి. కచ్చితంగా ఇంటర్ స్టేట్ మైగ్రేషన్, డూప్లికేషన్ అంశంపై దృష్టి పెట్టాలి. అదే విధంగా దేశంలో ఉండే సంచార జాతుల వాళ్లకు ఏ విధంగా ఓటు ఇస్తారో చెప్పాలి? క ఇంట్లో ఉండే వాళ్లందరికీ ఒకే బూత్ లో ఓటు ఉండేలా చర్యలు తీసుకోవాలి. ఎస్ఐఆర్ ద్వారా ఇంటర్ స్టేట్ డూప్లికేషన్ ఓట్లను కూడా కట్ చేయాలి. లేదంటే ఎస్ఐఆర్ కు అర్థం ఉండదు. ఎస్ఐఆర్ అనేది పర్మినెంట్ సొల్యూషన్ గా ఉండాలని మేము కోరుతున్నాం. మాలాంటి కొత్త పార్టీకి ఇది చాలా ఇంపార్టెంట్. కచ్చితంగా ఫెయిర్ గా ఎన్నికల జాబితా సిద్ధం చేయాలని ఈసీని కోరుతున్నాం. మేము లేవనెత్తిన ప్రశ్నలన్నింటికీ ఈసీ సమాధానం చెప్పాలని వినమ్రంగా విజ్ఞప్తి చేస్తున్నామని అన్నారు.

# మన వరంగల్ వసీ మహేష్ దీక్షిత్ కొత్త ఐబీ ఛీఫ్

**వరంగల్ :** దేశ రక్షణ, అంతర్గత భద్రతకు సంబంధించిన అత్యంత కీలకమైన నిఘా విభాగం ఇంటెలిజెన్స్ బ్యూరో సరికొత్త బాస్‌ను కేంద్రం నియమించింది. భారత ప్రభుత్వ అత్యున్నత నియామకాల కమిటీ దేశ రక్షణ రంగంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ఈ పోస్టుకు తెలంగాణ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి డాక్టర్ మహేష్ దీక్షిత్‌ను నియమించింది. దేశవ్యాప్తంగా ఉన్న అంతర్గత భద్రతా సవాళ్లు, సరిహద్దు ఉగ్రవాదం, సైబర్ దాడుల ముప్పు పెరిగిపోతున్న వేళ.. ప్రధాని నరేంద్ర మోదీ, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ టీమ్ ఈ వ్యూహాత్మక ఎంపిక చేసింది. ఈ నియామకంతో తెలుగు రాష్ట్రాలకు, ముఖ్యంగా తెలంగాణ ఐపీఎస్ కేడర్‌కు జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కినట్లయింది. క్షేత్రస్థాయిలో నిఘా ఆపరేషన్లు అత్యంత విజయవంతంగా నిర్వహించిన ట్రాక్ రికార్డ్ మహేష్ దీక్షిత్‌కు ఉంది. గతంలో దేశంలోనే అత్యంత సున్నితమైన ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్‌లో ఆయన చేసిన కౌంటర్-ఇంటెలిజెన్స్ ఆపరేషన్స్ కేంద్ర ప్రభుత్వ పెద్దల ప్రశంసలు అందుకున్నాయి. షాడో ఆఫీసర్‌గా, టెక్-సావీ నిఘా నిపుణుడిగా పేరు తెచ్చుకున్న ఒక తెలుగు కేడర్ అధికారి.. దేశ రక్షణ వ్యవస్థకు గుండెకాయ లాంటి ఐబీకి చీఫ్ అయ్యారు. నూతన ఐబీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించబోతున్న డాక్టర్ మహేష్ దీక్షిత్ 1993 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన.. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణ కేడర్ కిందకు వచ్చారు. పోలీస్ సర్వీస్‌లో జాయిన్ అయిన మొదటి రోజు నుంచే టఫ్ ఆఫీసర్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. క్షేత్రస్థాయిలో లా అండ్ ఆర్డర్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా, తెరవెనుక జరిగే నేరాలను, దేశద్రోహ వ్యూహాలను ముందే పసిగట్టే ఇంటెలిజెన్స్ బ్రెయిన్ ఆయన సొంతం. కేంద్ర ప్రభుత్వ డెప్యుటేషన్‌పై ఇంటెలిజెన్స్ బ్యూరోలో అడుగుపెట్టిన తర్వాత మహేష్ దీక్షిత్ కెరీర్ గ్రాఫ్ వేగంగా పెరిగింది. ఐబీలో జాయింట్
డైరెక్టర్‌గా, అదనపు డైరెక్టర్‌గా అత్యంత కీలకమైన విభాగాలను ఆయన పర్యవేక్షించారు. 2024 సెప్టెంబర్‌లో కేంద్ర ప్రభుత్వం ఆయనను ఇన్-సిటు ప్రాతిపదికన స్పెషల్ డైరెక్టర్ గా పదోన్నతి కల్పించింది. నిఘా రంగంలో దశాబ్దాల అనుభవం, క్లిష్టమైన కేసులను ఛేదించడంలో ఆయన చూపిన చొరవను గుర్తించి, ప్రస్తుత ఐబీ డైరెక్టర్ పదవీకాలం ముగిసిన తరుణంలో కేంద్రం ఆయనకు దేశ నిఘా పగ్గాలను అప్పగించింది. మహేష్ దీక్షిత్ కెరీర్‌లో జమ్మూ కశ్మీర్‌లో చేసిన సేవలే కీలకంగా మారాయి. కశ్మీర్ లోయలో




ఉగ్రవాదం, సరిహద్దు దాటి వచ్చే చొరబాట్లు, లోకల్ స్లీపర్ సెల్స్ నెట్‌వర్క్ ఉధృతంగా ఉన్న సమయంలో ఆయన అక్కడ ఇంటెలిజెన్స్ విభాగంలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. టెర్రర్ ఫండింగ్ మూలాలను దెబ్బతీయడం, సరిహద్దు అవతలి నుంచి వచ్చే కోడెడ్ మెసేజ్‌లను డీకోడ్ చేయడం ద్వారా ఎన్నో భారీ ఉగ్రదాడులను ముందే భగ్నం చేయడంలో ఆయనది కీలక పాత్ర. ఆయన కాశ్మీర్‌లో ఉన్నప్పుడు సృష్టించిన హ్యూమన్ ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్ నేటికీ నిఘా వర్గాలలో ఒక కేస్ స్టడీగా చెబుతుంటారు. లోకల్ ఇన్ ఫార్మర్ల ద్వారా సమాచారాన్ని సేకరించడంలో, టెక్నాలజీ ఆధారిత సర్వైలెన్స్‌ను సమన్వయం చేయడంలో మాస్టర్‌మైండ్‌గా నిలిచారు. కాశ్మీర్ ఆపరేషన్లలో చూపిన ఈ అసాధారణ ప్రతిభే ఆయనను ఢిల్లీలోని నార్త్ బ్లాక్ పెద్దలకు అత్యంత నమ్మకస్తుడైన ఆఫీసర్‌గా మార్చింది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో అంతర్గత నిఘా గ్రిడ్‌ను బలోపేతం చేయడంలో విశేష కృషి చేశారు. భారతదేశంలో ఇంటెలిజెన్స్ బ్యూరో అనేది దేశ అంతర్గత భద్రతను కాపాడే అత్యున్నత రహస్య నిఘా సంస్థ. విదేశీ నిఘా కోసం రా పనిచేస్తుంటే, దేశ సరిహద్దుల లోపల జరిగే విద్రోహ చర్యలు, తీవ్రవాదం, నక్సలిజం, అంతర్గత కల్లోలాలను అణచివేయడానికి ఐబీ శ్రమిస్తుంది. అటువంటి సంస్థకు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం అంటే ముళ్ల కిరీటాన్ని ధరించడమే. ప్రస్తుత డిజిటల్ యుగంలో నూతన ఐబీ చీఫ్ మహేష్ దీక్షిత్ ముందు చాంతాడంత సవాళ్లు ఉన్నాయి. సైబర్ వార్‌ఫేర్, డిజిటల్ దాడులు, ప్రభుత్వ డేటా హ్యాకింగ్ ప్రయత్నాలు, డీప్‌ఫేక్, సోషల్ మీడియా ప్రొపగాండాకు బ్రేక్ వేయడం. దేశంలోని ప్రధాన నగరాల్లోని స్లీపర్ సెల్స్ కదలికలపై డేగకన్ను వేసి ఉంచడం ఇవన్నీ నియంత్రించడం ఆయన ముందు ఉన్న సవాళ్లు. రాబోయే రోజుల్లో దేశీయంగా, అంతర్జాతీయంగా ఎదురయ్యే సరికొత్త భద్రతా సవాళ్లను ఎదుర్కోవడానికి ఒక డైనమిక్, యాక్షన్-ఓరియెంటెడ్ ఆఫీసర్ అవసరమని భావించే మహేష్ దీక్షిత్‌ను ఎంపిక చేశారు. ప్రస్తుతం పొరుగు దేశాలలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, సరిహద్దుల్లో ఉద్రిక్తతల వల్ల దేశంలో అంతర్గత శాంతిభద్రతలు అత్యంత ముఖ్యం. ఏ చిన్న ఇంటెలిజెన్స్ వైఫల్యం జరిగినా అది దేశ ప్రతిష్టకు భంగం కలిగిస్తుంది. అందుకే, దేశంలోని ప్రతి అంగుళంపై అవగాహన ఉన్న, ముఖ్యంగా కాశ్మీర్ వంటి కఠిన ప్రాంతాల్లో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పాతరేసిన అనుభవం ఉన్న దీక్షిత్ అయితేనే ఈ పదవికి నూటికి నూరుపాళ్లు న్యాయం చేయగలరని కేంద్రం గట్టిగా విశ్వసించింది.

## కళాశాలలో కనీస వసతులకై కలెక్టర్ కు ఫిర్యాదు..




**నవగీతం,జగిత్యాల:** జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండల కేంద్రంలో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు కనీస వసతులు సరిగా లేవని బిజెపి జిల్లా అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యమ్ ప్రజావాణిలో కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. జూనియర్ కళాశాలలోని విద్యార్థులు పడుకునే డార్మెటరి హాల్ లో కనీస సౌకర్యాలైన తలుపులు, కిటికీలు లేవని మంచాలు తుప్పపట్టి వంగిపోయి విద్యార్థులు పడుకోవడానికి వీలు లేకుండా ఉన్నాయని తెలిపారు. ఈసందర్భంగా మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి గురుకులాలు,మోడల్ స్కూల్స్,ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరిట వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నప్పటికి క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదన్నారు.మంత్రుల కొడుకులు ముఖ్యమంత్రి కొడుకు ఇలాంటి స్కూల్స్ లోనే చదువుతున్నారా అని ప్రశ్నించారు.వసతి గృహానికి తలుపులు, కిటికీలు లేనందున ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాములు,తేళ్లు,జెర్రులు ఇతర విష పురుగులు ప్రవేశించే అవకాశం ఉందని దానివల్ల విద్యార్థులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గతంలో ఇలాంటి ఘటనలు జరిగి పదుల సంఖ్యలో విద్యార్థులు మృతిచెందిన విషయాన్ని ఈసందర్భంగా గుర్తు చేశారు.

## సి సి రోడ్డు పనులు ప్రారంభించిన సర్పంచ్



**నవగీతం,మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలో ఊరి పెద్ద పోచమ్మ ఆలయం ముందు గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో ఈ జి ఎస్ నిధులు రూ.5 లక్షలతో సి.సి రోడ్డు పనులను సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ప్రారంభించారు .ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ మాట్లాడుతూ గ్రామంలో ముఖ్యంగా ఎక్కడ అవసరమున్నా అక్కడ సి.సి రోడ్లు నిర్మిస్తాన్నమని, గ్రామ అభివృద్ధికి గ్రామస్తులు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సోమ రెడ్డి,మాజీ ఎం.పీ.టీ.సీ మరిపెల్లి సత్తమ్మ-మల్లయ్య, వార్డు సభ్యులు ముష్కరి రమేష్,కొంపల్లి రాకేష్, కాషవత్తుల గంగా రెడ్డి, భూక్య శేఖర్,ఎనుగంటి నరేష్ ముత్యాల గంగారాజం, శనివారపు లావణ్య -నరేష్ అల్లె లత-చంద్రయ్య,పెద్దిరెడ్డి లక్ష్మణ్, ఉయ్యాల లక్ష్మణ్, మకిలి రాకేష్,పాల్త్య గంగాధర్,సామాజిక కార్యకర్త ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థిగా మారి.. పాఠాలు వింటున్న కలెక్టర్

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**దుమాల ఈఎంఆర్ఎస్ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ**

**రాజన్న సిరిసిల్ల** నిత్యం విధి నిర్వహణలో బిజీ బిజీగా ఉండే జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ విద్యార్థులకు బోధన చేస్తున్న తీరును వారితో కలిసి కూర్చుని పరిశీలిస్తూ.. పాఠ్యాంశం విన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్) విద్యాలయంలో సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎకనామిక్స్ పాఠ్యాంశం ఉపాధ్యాయుడు బోధిస్తుండగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో కలిసి బెంచి పై కూర్చున్నారు. పాఠ్యాంశం బోధనను స్వయంగా పరిశీలించారు.పూర్తి అయిన తర్వాత దానిపై విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అనంతరం డైనింగ్ హాల్ కు వెళ్లి విద్యార్థులు భోజనం చేస్తుండగా.. ముందుగా మెనూ పరిశీలించి.. సిద్ధం చేసిన ఆహార పదార్థాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం ప్రతి రోజు భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి విద్యార్థి ప్రణాళిక ప్రకారం చదవాలని, ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి. చదువులో రాణించి.. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. లైబ్రరీ లో పుస్తకాలతోపాటు దిన పత్రికలు చదవాలని తెలిపారు. దీంతో అన్ని విషయాలపై అవగాహన వస్తుందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ వివరించారు. పరిశీలనలో ప్రిన్సిపాల్ ఫాతిమా, ఎంపీడీఓ సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## ట్రిపుల్ ఐటీ కు ఎంపికైన బ్రిలియంట్ పాఠశాల విద్యార్థిని

**చాగలమర్రి :** చాగలమర్రి మండల పరిధిలోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాల నుంచి ఒంగోలు ఐఐఐటీ లో ప్రవేశానికి ఎంపిక కావడం పాఠశాలకు గర్వకారణమని కరస్పాండెంట్ ఓ.వా. అన్సర్ భాష గారు తెలిపారు. పాఠశాల విద్యార్థిని అయిన ఐ . ఆనంద కుమారి పదవ తరగతి ఫలితాలలో 591 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానం, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో రాష్ట్రంలో ఉన్నత స్థాయి ర్యాంకు సాధించడమే కాకుండా ఐఐఐటీ ఫలితాలలో ఒంగోలు లో సీటు సాధించిన సందర్భంగా విద్యార్థినిని అభినందించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను, వారి కృషి మరియు పట్టుదల, మార్గదర్శకత్వం వల్ల ఈ విజయం సాధ్యమైందని భవిష్యత్తులో కూడా ఉన్నత శిఖరాలను సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలను తీసుకురావాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందిస్తూ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ విజయం పాఠశాలలో చదువుతున్న ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యార్థిని ఈ అద్భుత విజయం పై తల్లిదండ్రులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు

## అదుపు తప్పి బోల్తా పడ్డ సెలైన్ లోడ్ ఐచర్

**తుగ్గలి :** తుగ్గలి మండల పరిధిలోని జొన్నగిరి గ్రామం విద్యుత్ ఉపకేంద్రం మలుపు వద్ద చెన్నైకు సెలైన్ బాటిల్ లోడ్ తో వెళ్తున్న ఎంహెచ్ 04 ఎల్ఈ 3783 ఐచర్ వాహనం సోమవారం రోజున అదుపుతప్పి బోల్తా పడింది.ఐచర్ వాహనం బోల్తా పడడంతో డ్రైవర్ కు స్వల్ప గాయాలయ్యాయని,ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని స్థానికులు

## బిజినెస్

### నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలే కారణం..!




దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. పశ్చిమాసియా లో మళ్లీ తలెత్తిన ఉద్రిక్తతల నేపథ్యంలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపారు. దీనికితోడు ఆటో, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ స్టాక్స్ లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు భారీగా నష్టపోయాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 372.10 పాయింట్లు నష్టపోయి 76,728.37 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 109.75 పాయింట్లు క్షీణించి 23,946.25 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆందోళనలతో ట్రేడర్లు రిస్క్ తీసుకోవడానికి వెనుకాడారు. దాంతో దాదాపు అన్ని రంగాల్లోనూ అమ్మకాలు వెల్లువెత్తాయి. ముఖ్యంగా మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా మోటార్స్ షేర్లు ప్రధాన నష్టాల్లో ఉన్నాయి. సాంకేతిక నిపుణుల విశ్లేషణ ప్రకారం.. నిఫ్టీకి 24,000 కీలక నిరోధంగా మారింది. దీనిని దాటితే 24,100-24,200 స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇక దిగువన 23,900 తక్షణ మద్దతుగా, 23,800 బలమైన మద్దతుగా పనిచేస్తుందని వారు తెలిపారు. ఇవాళ ట్రేడింగ్‌లో ఫార్మా, మెటల్, హెల్త్‌కేర్ రంగాలు రాణించగా.. ఆటో, కెమికల్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు అత్యధికంగా నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్లలోనూ మిడ్‌క్యాప్ సూచీ 0.37 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.62 శాతం మేర నష్టపోయాయి. రాబోయే రోజుల్లో పశ్చిమాసియా పరిణామాలు, ఇతర అంతర్జాతీయ సంకేతాలు మార్కెట్ గమనాన్ని నిర్దేశిస్తాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

### ఆ 3 బ్యాంకులు విలీనం కాబోతున్నాయా? నిజమెంత?




ఇంటర్నెట్ డెస్క్: దేశంలోని మూడు ప్రభుత్వ రంగ బ్యాంకుల విలీనమంటూ జరుగుతున్న ప్రచారాన్ని కేంద్రం ఖండించింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ , కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విలీనానికి ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సామాజిక మాధ్యమాల్లో సర్క్యులేట్ అవుతున్న ఓ ఫొటో నకిలీదని తేల్చి చెప్పింది. ఈ ప్రచారం అవాస్తవమని, ఎవరూ నమ్మొద్దని విజ్ఞప్తి చేస్తూ పీఐబీ ఫ్యాక్ట్ చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా ఓ పోస్టు పెట్టింది. బ్యాంకులకు సంబంధించిన అధికారిక సమాచారాన్ని ఆర్‌బీఐ వెబ్‌సైట్‌లో చెక్ చేసుకోవచ్చని తెలిపింది. ఏదైనా అనుమానాస్పద సమాచారాన్ని గుర్తిస్తే తమ వాట్సప్ నంబర్ 8799711259, ఈ-మెయిల్ factcheck@pib.gov.inకు పంపవచ్చని ప్రజలను కోరింది.

# జూలై ఒకటో తేదీ నుంచి మారనున్న కొన్ని రూల్స్..!

కొత్త నెల ప్రారంభం కానుందంటే ఆర్థికంగా కొన్ని కీలక మార్పులు జరిగే అవకాశం ఉంటుంది. డబ్బు, బ్యాంకింగ్ (ధీఅఎఅఅస్త్ర), పన్నులు (ఖుఇవం), క్రెడిట్ కార్డుల (జతీవఎత్ ఖ్షతీం) కు సంబంధించి ఏదో అప్‌డేట్ ఉంటూ ఉంటుంది. ఈ క్రమంలో జూలై 1 నుంచి ఆధార్ (ఌూఎష్ఠ్ఖుఖుతీ) నుంచి పాస్‌పోర్ట్ (ఖ్రుఖంంజూశీఙ్), ఐటీఆర్ (ఘ=) నుంచి క్రెడిట్ కార్డుల వరకు పలు కొత్త మార్పులు అమల్లోకి రానున్నాయి. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నులు జూలై 31 లోపు దాఖలు చేయాలి. ఐటీఆర్-1, ఐటీఆర్-2 దాఖలుచేసే వారికి ఈ గడువు వర్తిస్తుంది. ఆలస్యమైతే జరిమానా పడే అవకాశం ఉంది. కొన్ని పన్ను ప్రయోజనాలు కూడా కోల్పోయే అవకాశం ఉండవచ్చు. కాబట్టి చివరి తేదీ వరకు వేచి ఉండకుండా ముందుగానే రిటర్నులు దాఖలు చేయడం మంచిది.

**ఆధార్‌లో ఈ-మెయిల్ అప్‌డేట్**

ఆధార్ వినియోగదారులకు శుభవార్త. ఆధార్‌లో నమోదైన ఈ-మెయిల్ చిరునామాను మార్చుకోవడానికి ఇకపై రూ.75




చెల్లించాల్సిన అవసరం లేదు. ఆధార్ మొబైల్ యాప్ ద్వారా ఈ సేవను ఉచితంగా పొందవచ్చు. ఈ సదుపాయం 2026 డిసెంబర్ 31 వరకు అందుబాటులో ఉంటుంది.

**ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల్లో కొత్త రూల్స్**

ఫోన్‌పే ఎస్‌బీఐ క్రెడిట్ కార్డుల రివార్డు పాయింట్ల విధానంలో మార్పులు వస్తున్నాయి. కొన్ని లావాదేవీలపై ఇకపై రివార్డు పాయింట్లు ఇవ్వరు. అలాగే ఖర్చులు నిర్దేశిత పరిమితి దాటితేనే పాయింట్లు లభిస్తాయి. ఈ మార్పులు ఎంపిక చేసిన కార్డులకు మాత్రమే వర్తిస్తాయి.

**హెచ్‌డీఎఫ్‌సీ కొత్త షరతు**

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు వినియోగదారులకు ఎయిర్‌పోర్ట్ లాంజ్ సదుపాయంపై కొత్త నిబంధన అమల్లోకి వస్తుంది. ఒక త్రైమాసికంలో మూడు ఉచిత లాంజ్ సందర్శనలు పొందాలంటే.. అంతకుముందు త్రైమాసికంలో కనీసం రూ.60 వేలు ఖర్చు చేసి ఉండాలి.

**పాస్‌పోర్ట్ సేవలు ఖరీదు**

జూలై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజులు పెరగనున్నాయి. సాధారణ, తత్కాల్ పాస్‌పోర్ట్‌లకు కొత్త రుసుములు అమల్లోకి వస్తాయి. దేశీయంగా, విదేశాల్లో దరఖాస్తు చేసుకునే వారందరికీ ఈ మార్పులు వర్తిస్తాయి.

**బ్యాంకుల మిస్‌సెల్లింగ్‌కు చెక్**

బ్యాంకులు అవసరం లేని బీమా, పెట్టుబడి ఉత్పత్తులను బలవంతంగా విక్రయించకుండా ఆర్‌బీఐ కొత్త నిబంధనలు తీసుకొస్తోంది. జూలై 1 నుంచే ఈ మార్గదర్శకాలు అమల్లోకి రానున్నాయి. కస్టమర్ల ప్రయోజనాలను కాపాడడమే దీని ఉద్దేశం.

# జులైలో బ్యాంక్ హాలిడేస్: 12 రోజులు సెలవు!

జూలై 2026 సమీపిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా బ్యాంక్ ఖాతాదారులు తమ పనులను ముందుగానే ప్లాన్ చేసుకుంటున్నారు. ఈ నెలకు సంబంధించిన సెలవుల జాబితాను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) విడుదల చేసింది. ఇందులో ప్రాంతీయ పండుగలు, జాతీయ స్థాయి ఆచారాలు, అలాగే ప్రతి వారం వచ్చే వారాంతపు సెలవులు కూడా ఉన్నాయి.

జూలై 6న మిజోరాంలో ఎంహెచ్‌ఐపీ డే సందర్భంగా బ్యాంకులకు సెలవు

జూలై 9న మేఘాలయలో బెహ్ డెయిన్‌ఖ్లామ్ పండుగ కారణంగా బ్యాంకులు పనిచేయవు

జూలై 16న ఒడిశా, ఉత్తరాఖండ్, మణిపూర్ రాష్ట్రాల్లో రథయాత్ర, హరేలా వంటి పండుగల కారణంగా బ్యాంక్ సేవలు రద్దు

జూలై 17న మేఘాలయలో యూ తిరోత్ సింగ్ వర్ధంతి

జూలై 18న సిక్కింలో ద్రుక్పా త్షే-జి బౌద్ధ పండుగ

జూలై 22న త్రిపురలో ఖార్చి పూజ సందర్భంగా బ్యాంకులకు సెలవు




ఇవి కాకుండా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా బ్యాంకులు మూసివేయబడతాయి. 2026 జూలైలో ఆదివారాలు జూలై 5, 12, 19, 26 తేదీలకు వస్తాయి. అలాగే రెండో శనివారం జూలై 11, నాలుగో శనివారం జూలై 25న కూడా బ్యాంక్ కార్యకలాపాలు ఉండవు. మొత్తం మీద బ్యాంకులకు 12 రోజులు సెలవులన్నమాట. ఈ సెలవుల కారణంగా బ్యాంక్ బ్రాంచ్ సేవలు అందుబాటులో ఉండకపోయినా, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు మాత్రం కొనసాగుతాయి. ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, యూపీఐ, డెబిట్ మరియు క్రెడిట్ కార్డులు, అలాగే ఏటీఎం సేవలు సాధారణంగా పనిచేస్తాయని రిజర్వ్ బ్యాంక్ సూచించింది.

## స్టోక్స్ వీడ్కోలు టెస్టులో ఇంగ్లండ్ ఓటమి..

# సిరీస్ న్యూజిలాండ్ కైవసం..!

స్వదేశంలో బజ్‌బాల్ ఆటతో రెచ్చిపోయే ఇంగ్లండ్‌ను న్యూజిలాండ్ చిత్తుగా ఓడించింది. ఓవల్ టెస్టులో విజయంతో సిరీస్ సమం చేసిన కివీస్ నాటింగ్‌హమ్ టెస్టులో 160 పరుగులతో గెలిచి సిరీస్‌ను కైవసం చేసుకుంది. ఛేదనలో తడబడిన ఆతిథ్య జట్టు.. ఫౌల్క్స్(3-52) ధాటికి కుప్పకూలింది. జేమీ స్మిత్(60)అర్ధ శతకంతో పోరాడినా గట్టెక్కించలేకపోయాడు. ఫలితంగా టెస్టు సిరీస్‌లో వెనకబడిన న్యూజిలాండ్..2-1తో విజేతగా నిలవడం ఇదే మొదటిసారి. ఇక మ్యాచ్ మధ్యలోనే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బెన్ స్టోక్స్‌ను ఈ పరాజయం మరింత బాధించనుంది. సిరీస్ విజేతను నిర్ణయించే నాటింగ్‌హమ్ టెస్టులో తొలి రోజే ఆధిపత్యం చెలాయించిన న్యూజిలాండ్‌ను ఇంగ్లండ్‌ను మట్టకరిపించింది. రెండో ఇన్నింగ్స్‌ను 288-9 వద్ద డిక్లేర్ చేసిన కివీస్.. ఐదోరోజు ప్రత్యర్థిని పడగొట్టింది. జకారీ ఫౌల్క్స్(3-52) విజృంభణతో టాపార్డర్ విఫలమవ్వగా.. జేమీ స్మిత్(60), గస్ అట్కిన్సన్(19)లు ప్రతిఘటించారు. లంచ్‌కు వెళ్లిన ఇంగ్లండ్.. కాసేపటికే మూడు వికెట్లు కోల్పోయింది. దాంతో, చివరి మ్యాచ్ ఆడుతున్న కెప్టెన్ బెన్ స్టోక్స్‌కు విజయంతో వీడ్కోలు పలకాలనుకున్న ఆతిథ్య జట్టు ఆశలు ఆవిరయ్యాయి.

**డకెట్ శతకంతో..**

తొలి ఇన్నింగ్స్‌లో ధీటుగా బదులిచ్చింది ఇంగ్లండ్. ఓపెనర్ బెన్ డకెట్(113) శతకంతో భారీ స్కోర్‌కు బాటలు వేశాడు.



మరో ఎండ్‌లో కుర్రాడు జాకబ్ బెథెల్(74) అర్ధ శతకంతో భయపెట్టాడు. కానీ, న్యూజిలాండ్ పేసర్లు మూడో రోజు ఆరంభంలోనే రెచ్చిపోయారు. నాథన్ స్మిత్(4-91), జకారీ ఫౌల్క్స్(3-35), విలియం ఓ రూర్కీ(3-53)లు వికెట్ల వేటతో స్టోక్స్ సేనను పడగొట్టారు.

బెన్ డకెట్(113), జాకబ్ బెథెల్(74)

విలియం ఓ రూర్కీ(3-53) ధాటికి తొలి సెషన్‌లోనే నాలుగు వికెట్లు కోల్పోయిన ఆతిథ్య జట్టు.. తొలి ఇన్నింగ్స్‌లో 354కే ఆలౌటైంది. కివీస్‌కు 84 పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. తొలుత టామ్ లాథమ్(151), డెవాన్ కాన్వే(157)ల శతకాలో న్యూజిలాండ్ 438 పరుగులు చేసింది.

### 2028 ఒలింపిక్స్.. అర్హత సాధించిన భారత మహిళల క్రికెట్ జట్టు

ఇంటర్నెట్ డెస్క్: టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించి బాధలో ఉన్న భారత మహిళల క్రికెట్ జట్టుకు గుడ్‌న్యూస్. 2028 ఒలింపిక్స్‌కు హర్మన్‌ప్రీత్ సేన అర్హత సాధించింది. ఈ మేరకు ఐసీసీ, అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) ధ్రువీకరించాయి. ప్రస్తుతం జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచ కప్‌లో టీమ్‌ఇండియా సెమీ ఫైనల్స్‌కు చేరుకోలేకపోయింది. అయితే, ఈ టోర్నీలో ఆసియా తరఫున భారత్ అత్యుత్తమ ప్రదర్శన చేసింది. దీంతో భారత జట్టు ఒలింపిక్ బెర్త్‌ను ఖాయం చేసుకుంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, సౌతాఫ్రికా కూడా క్వాలిఫై అయ్యాయి. అమెరికాలోని లాస్ ఏంజెలెస్ వేదికగా 2028 ఒలింపిక్ గేమ్స్ జరగనున్నాయి. 1900లో ఒక్కసారి మాత్రమే ఒలింపిక్స్‌లో భాగమైన క్రికెట్.. 2028లో పునరాగమనం చేయబోతున్న సంగతి తెలిసిందే. లాస్ ఏంజెలెస్




ఒలింపిక్స్‌లో క్రికెట్ పోటీలను ఆరు జట్లతో నిర్వహించనున్నారు.

## స్పోర్ట్స్

### హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జైత్రయాత్ర.. వరుసగా నాలుగో విజయం



**హైదరాబాద్:** టీజీ20 లీగ్ 2026లో హైదరాబాద్ ఈ-ఛాంపియన్స్ జైత్రయాత్ర కొనసాగుతోంది. సోమవారం అన్విత ఖమ్మం ఏసెస్‌తో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు 56 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఈ-ఛాంపియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 211పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఖమ్మం 155/9 పరుగులకు పరిమితమైంది. హిమతేజ (64; 44 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఒక్కడే పోరాడాడు. మిగతా బ్యాటర్లు చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. వాఫి కచ్చి (21), సహేంద్ర మల్లు (16), విద్యానంద రెడ్డి (16) పరుగులు చేశారు. హైదరాబాద్ బౌలర్ శ్రీనికేత్ (3/28) ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అజయ్‌దేవ్ గౌడ్ 2, గడుగు గణేశ్ 2, షణ్ముఖ అశ్విన్, అన్విత్ రెడ్డి ఒక వికెట్ తీశారు. ఖమ్మంకు నాలుగు మ్యాచ్‌ల్లో ఇది రెండో ఓటమి. తొలుత హైదరాబాద్ బ్యాటర్లలో ఓపెనర్, కెప్టెన్ అభిరథ్ రెడ్డి (59; 26 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్స్‌లు), ఆఖర్లో గడుగు గణేశ్ (44; 21 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) మెరుపులు మెరిపించారు. సాయివికాస్ (22), అన్విత్‌రెడ్డి (32), షణ్ముఖ అశ్విన్ (19), ప్రణవ్ వర్మ (18) రాణించారు. అభిరథ్ రెడ్డి ఆరంభం నుంచే దూకుడుగా ఆడాడు. విద్యానంద రెడ్డి, సాకేత్ బౌలింగ్‌లో ఒక్కో సిక్స్ బాదిన హైదరాబాద్ కెప్టెన్.. మహేశ్ విప్పర్ల వేసిన నాలుగో ఓవర్‌లో వరుసగా 4, 4, 6, 6 బాదేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. విద్యానంద వేసిన ఐదో ఓవర్‌లో వరుసగా 6, 4, 4, 4తో విరుచుకుపడి 18 బంతుల్లోనే అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. దీంతో ఐదు ఓవర్లకే ఈ-ఛాంపియన్స్ 67/0తో నిలిచింది. అభిరథ్‌ను వేద్ రెడ్డి పెవిలియన్‌కు పంపి ఖమ్మంకు బ్రేక్ ఇచ్చాడు. తర్వాత వచ్చిన బ్యాటర్లు తలో చేయి వేసి ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించారు. చివర్లో గణేశ్ దూకుడుగా ఆడటంతో స్కోరు 200 దాటింది. ఖమ్మం బౌలర్లలో సాకేత్, వేద్ రెడ్డి, సహేంద్ర తలో 2, జీఎస్‌కే రెడ్డి ఒక వికెట్ పడగొట్టారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
సోమవారం
29 జూన్ 2026



# సూర్యతో హోంబలే ఫిలింస్ భారీ ప్రాజెక్ట్.. 'జై భీమ్' కాంబో రిపీట్.. ఫ్యాన్స్‌కు బిగ్ సర్‌ప్రైజ్!

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య అభిమానులకు అదిరిపోయే గుడ్ న్యూస్ వచ్చింది. 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ చిత్రాలను అందించిన హోంబలే ఫిలింస్ తమ తదుపరి ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అధికారికంగా ప్రకటించింది. సూర్య హీరోగా, 'జై భీమ్' దర్శకుడు టి.జె. జ్ఞానవేల్ దర్శకత్వంలో ఈ భారీ చిత్రం రూపొందనుండటం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత కొన్ని రోజులుగా సూర్య-జ్ఞానవేల్ కాంబినేషన్ మరోసారి రిపీట్ కానుందనే వార్తలు వినిపించినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌ను హోంబలే ఫిలింస్ నిర్మించనుండటం మాత్రం అభిమానులకు ఊహించని సర్‌ప్రైజ్‌గా మారింది. భారీ నిర్మాణ విలువలకు పేరుగాంచిన ఈ సంస్థతో సూర్య తొలిసారి చేతులు కలపడం సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఈ సందర్భంగా హోంబలే ఫిలింస్ విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్రేమ్ బై ఫ్రేమ్, సినిమా బై సినిమా, పోరాటం బై పోరాటం తనకంటూ ఓ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్న నటుడు. నిజాయితీతో కూడిన పాత్రలు, జీవితాలను ప్రతిబింబించే కథలు, ధైర్యం మరియు నమ్మకంతో సాగిన మూడు దశాబ్దాల అద్భుత ప్రయాణం. ఈ తరం అత్యంత సాహసోపేతమైన నటుడు ఇప్పుడు తన కెరీర్‌లోనే అతిపెద్ద వేదికపైకి అడుగుపెడుతున్నారు" అంటూ సూర్య సినీ ప్రయాణాన్ని సంస్థ కొనియాడింది.ఇక ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు టెక్నికల్ టీమ్ కూడా భారీగానే సిద్ధమైంది. విజయ్ కిరగందూర్, చలువే గౌడ నిర్మిస్తున్న ఈ చిత్రంలో సూర్య సరసన కాయదు లోహర్ హీరోయిన్‌గా నటించనున్నారు. సంగీత దర్శకుడిగా సాయి అభ్యంకర్ పనిచేస్తుండగా, ఎస్.ఆర్. కతీర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహించనున్నారు. ఎడిటింగ్ బాధ్యతలను ఫిలోమిన్ రాజ్ చేపట్టనున్నారు. సామాజిక అంశాలను బలంగా చెప్పే దర్శకుడిగా గుర్తింపు పొందిన టి.జె. జ్ఞానవేల్, నటనకు కొత్త నిర్వచనం చెప్పే సూర్య, భారీ నిర్మాణ విలువలకు పేరుగాంచిన హోంబలే ఫిలింస్ కలయికలో వస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా స్థాయిలో సంచలనం సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి.ఈ చిత్రానికి సంబంధించిన టైటిల్, కథాంశం, షూటింగ్ షెడ్యూల్ తదితర వివరాలను మేకర్స్ త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు. ప్రస్తుతం సూర్య కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌లలో ఇది ఒకటిగా మారింది.





# వైజాగ్ వేదికగా 'లెనిన్' ట్రైలర్ విడుదల .. భారీ ఈవెంట్‌కు రంగం సిద్ధం

అక్కినేని అఖిల్ అభిమానులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మాస్ కంబ్యాక్ మూవీ 'లెనిన్' ఇప్పుడు ప్రమోషన్స్‌లో వేగం పెంచింది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్న ఈ మాస్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొనగా, తాజాగా ట్రైలర్ లాంచ్‌కు సంబంధించిన అప్‌డేట్ సినిమాపై మరింత హైప్‌ను పెంచుతోంది. చిత్ర బృందం 'లెనిన్' థియేట్రికల్ ట్రైలర్‌ను జూన్ 30న విశాఖపట్నంలో గ్రాండ్‌గా విడుదల చేయాలని నిర్ణయించింది. సాయంత్రం 4 గంటలకు నగరంలోని ప్రముఖ శరత్ థియేటర్‌లో ఈ ఈవెంట్ జరగనుంది. ట్రైలర్ లాంచ్ కోసం ఇప్పటికే భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. అఖిల్ అభిమానులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం కనిపిస్తోంది. ఈ సందర్భంగా విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోస్టర్‌లో అఖిల్ పూర్తిస్థాయి రస్టిక్ లుక్‌లో సైకిల్ తొక్కుతూ కనిపించడం అభిమానులను ఆకట్టుకుంటోంది. డస్ట్‌తో నిండిన గ్రామీణ వాతావరణంలో ఊరమాస్ అవతార్‌లో దర్శనమిచ్చిన అఖిల్, తన కెరీర్‌లో ఇప్పటివరకు కనిపించని కొత్త గెటప్‌లో కనిపిస్తున్నారు. 'ఏజెంట్' తర్వాత అఖిల్ నుంచి వస్తున్న ఈ సినిమా ఆయన కెరీర్‌కు కీలకంగా మారనుంది. చాలా కాలంగా సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్, ఈసారి పూర్తిస్థాయి మాస్ యాక్షన్ కథను ఎంచుకోవడం విశేషం. గ్రామీణ నేపథ్యం, ఎమోషన్స్, యాక్షన్ అంశాలతో రూపొందుతున్న ఈ చిత్రం అభిమానుల్లో ప్రత్యేక ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ చిత్రంలో అఖిల్ సరసన యువ నటి భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. వీరిద్దరి కెమిస్ట్రీ కూడా సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర యూనిట్ చెబుతోంది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ఈ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, మనం ఎంటర్‌ప్రైజెస్ బ్యానర్లపై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, పాటలపై మంచి అంచనాలు నెలకొన్నాయి. జూలై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానున్న 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లో అత్యంత కీలకమైన సినిమాగా భావిస్తున్నారు. ట్రైలర్ విడుదల తర్వాత సినిమాపై అంచనాలు మరింత పెరిగే అవకాశం ఉందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# 'చంద్రప్పన్' సినిమా ట్రైలర్ లాంచ్



డా.పి.యష్మన్, సోనాలీ హీరో హీరోయిన్లుగా చేసిన సినిమా 'చంద్రప్పన్'. యష్మన్ హీరోగా నటించడంతో పాటు స్టోరీ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్, లిరిక్స్, డైరెక్షన్ చేస్తున్నారు. జూలై 24న ఈ మూవీ థియేటర్లలో రిలీజ్ కానుంది. ఈ క్రమంలోనే తాజాగా ట్రైలర్ లాంచ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. దర్శకుడు వి. సముద్ర, నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. హీరో, డైరెక్టర్ యష్మన్ మాట్లాడుతూ..మేం చాలా జాగ్రత్తగా మంచి కంటెంట్‌తో ప్రేక్షకుల అభిరుచికి తగినట్లు మూవీ చేశాం. చాలా మంచి కాస్టింగ్ ఉంది. వాళ్లంతా డైరెక్టర్‌గా నేను ఎలా చెబితే అలా ఫెర్ఫార్మెన్ ఇచ్చారు. మా మూవీ అన్ని వర్గాల ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందని నమ్ముతున్నాం. ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని ఆశిస్తున్నాం. జూలై 24న రిలీజ్ అవుతున్న మా సినిమాను కూడా ఇలాగే సపోర్ట్ చేయండి అని అన్నారు.




# 'ఈ నగరానికి ఏమైంది' మళ్లీ వస్తోంది.. సీక్వెల్‌కి రిలీజ్ డేట్ ఫిక్స్

యువ దర్శకుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన కల్ట్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ఈ నగరానికి ఏమైంది' తెలుగు ప్రేక్షకుల మనసుల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న సంగతి తెలిసిందే. 2018లో విడుదలైన ఈ సినిమా మొదట థియేటర్లలో సాధారణ విజయాన్ని అందుకున్నప్పటికీ, తర్వాత ఓటీటీ మరియు టెలివిజన్ వేదికల ద్వారా విపరీతమైన క్రేజ్ సంపాదించింది. ముఖ్యంగా యువతలో ఈ సినిమాకు ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్ ఏర్పడింది.ఇప్పుడు ఆ కల్ట్ క్లాసిక్‌కు సీక్వెల్‌గా 'ఈ నగరానికి ఏమైంది రిపీట్' ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం చిత్ర బృందం అధికారికంగా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ ప్రత్యేక వీడియోను విడుదల చేసింది. ఈ చిత్రాన్ని నవంబర్ 19న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ వెల్లడించారు.మొదటి భాగంలో నలుగురు స్నేహితుల మధ్య జరిగే సరదా ప్రయాణం, వారి జీవితాల్లోని ఎమోషన్స్, ఫన్ ఎలిమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు సీక్వెల్‌లో కూడా అదే ఫ్రెండ్‌షిప్ బాండింగ్‌ను మరింత కొత్త కోణంలో చూపించబోతున్నట్లు సమాచారం.ఈసారి కథ ఎలాంటి నేపథ్యంతో సాగనుంది? పాత పాత్రలు మళ్లీ కనిపిస్తాయా? కొత్త పాత్రలు ఎవరెవరు? అనే అంశాలపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. మొదటి భాగంలో నటించిన విశ్వక్ సేన్, సుశాంత్ రెడ్డి, అభినవ్ గోమటం, వెంకటేశ్ కాకుమాను తమ అద్భుత నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ముఖ్యంగా వారి కామెడీ టైమింగ్, స్నేహితుల మధ్య సంభాషణలు ఇప్పటికీ సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి.సీక్వెల్‌లో కూడా ఈ ప్రధాన నటీనటులు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. తాజాగా విడుదలైన వీడియోలో నలుగురు హీరోలు విశ్వక్ సేన్, సాయినాథ్ మాగంటి, అభినవ్ గోమఠం, వెంకటేష్ కాకుమాను ఓ కార్ లో ముస్తఫా.. సాంగ్ పెట్టుకొని వెళ్తున్నట్టు కనిపించింది. ఈ సారి గోవా నుంచి థాయిలాండ్ కి వెళ్లే ట్రిప్ తో కథ ఉంటుందని అర్థమవుతుంది. "గ్యాంగ్ ఈజ్ బ్యాక్" అనే భావనను కలిగించేలా రూపొందించిన ఈ వీడియో ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచింది.

# అయ్యప్ప భక్తులకు పునకాలు తెప్పించే పాట




గత కొన్నాళ్లుగా వరస సినిమాలు చేస్తున్నప్పటికీ సక్సెస్ అందుకోలేకపోతున్న హీరో రవితేజ.. ప్రస్తుతం 'ఇరుముడి' అనే మూవీ చేస్తున్నాడు. అయ్యప్ప స్వామి బ్యాక్‌డ్రాప్‌లో తండ్రి-కూతురు సెంటిమెంటే దీని స్టోరీ. ఆగస్టు 21న థియేటర్లలో రిలీజ్ కానుందని కొన్నిరోజులు క్రితమే ప్రకటించారు. ఇప్పుడు 'ఇరుముడి కట్టు' అంటూ సాగే తొలి పాటని విడుదల చేసి ప్రమోషన్స్ మొదలుపెట్టారు. 'ఇరుముడి కట్టు' పాట గురించి అయ్యప్ప భక్తులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అయితే సదరు గీతం నుంచి లిరిక్స్ తీసుకున్నప్పటికీ ట్యూన్ మాత్రం చాలావరకు మార్చేశారు. 'స్వామియే అయ్యప్పో.. అయ్యప్పో స్వామియే' అనే లిరిక్స్, ట్యూన్ మాత్రం అలానే ఉంచేశారు. అయినా సరే ఈ గీతం వినడానికి బాగుంది. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్ కాగా శివ నిర్వాణ దర్శకుడు. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతమందిస్తున్నారు

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.